


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162


**సాయికృష్ణ కేసులో కీలక మలుపు**



2లో


ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 182 | బుధవారం 08- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028




## కేరళంలో భారీ వర్షాలు

**వర్షాలకు వయనాడ్ అతలాకుతలం** 2లో

**కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి**

**మట్టి దిబ్బల కింద పలువురిని కాపాడిన సిబ్బంది**

**సహాయక చర్యలకు అడ్డంకిగా మారిన వాతావరణం - వర్షాలపై సిఎం సతీశన్ అత్యవసర భేటీ.. వయనాడ్‌కు ఇద్దరు మంత్రులు**

కేరళంలో కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో ప్రమాదానికి దారితీశాయి. మంగళవారం మెప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం వద్ద భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. భారీ వర్షాలకు వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి.

## సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

2లో





విజయవాడ,చీఫ్ బ్యూరో నంది పత్రిక

- హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం
- మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఉపాధితో పాటు, కళ సజీవంగా ఉంటుంది
- దేశ సంస్కృతి, సంప్రదాయాల కోసం హస్తకళను కాపాడాలి
- వారసత్వాన్ని సజీవంగా కొనసాగిస్తున్న తీరు అభినందనీయం
- కళాకారుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలి
- హస్తకళా మహోత్సవన్‌ను సందర్శించిన డిప్యూటి సిఎం పవన్

## చరిత్ర సృష్టించిన మోదీ..



**ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా నరేంద్ర మోదీ** 2లో


**రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరుదేశాల మధ్య చారిత్రక బంధం ఉందని వ్యాఖ్య**

**ఈవీఎంల తయారీలో సాయం, ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు భారత్ సిద్ధమని ప్రకటన**

**భారత పథకాలపై ఇండోనేషియా అధ్యక్షుడి ప్రశంసలకు 'మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు' అని చమత్కారం**

## ఏపీకి పెట్టుబడుల వెల్లువ..

2లో



- ఏపీకి రూ.9,076 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- మొత్తం 11 ప్రాజెక్టుల ద్వారా 10,531 మందికి ఉద్యోగాలు
- రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
- పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు
- ఇథనాల్, సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.9,076.11 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 10,531 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రైతు కుటుంబాలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో, ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి ఒక ప్రత్యేక

## ఎయిర్ జర్నీకి అంతా రెడీ !

### భోగాపురం విమానాశ్రయం సిద్ధం..



**భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు**

**అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి** 2లో

**మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి**

ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈరోజు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు.

## హర్మూజ్‌లో మళ్లీ మిస్సైళ్ల మోత



**హర్మూజ్ జలసంధిలో మరోసారి భగ్గుమన్న ఉద్రిక్తతలు**

**వాణిజ్య నౌకలపై క్షిపణులతో దాడి చేసిన ఇరాన్**

**ఒమన్ తీరంలో జరిగిన ఈ ఘటనలో రెండు నౌకల ధ్వంసం**

**నౌకలపై దాడులు ఆపాలన్న అమెరికా** 2లో

## ఏపీకి పెట్టుబడుల వేట..

### కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు



**దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీ** 2లో

- ఎల్జీ, శాంసంగ్, హ్యుందాయ్ మోబిస్ వంటి దిగ్గజ సంస్థలతో భేటీ
- కాకినాడ, విశాఖలో యూనిట్లు, ఈవీ సెమీకండక్టర్ హబ్ ఏర్పాటుకు విజ్ఞప్తి
- ఏపీని ఏఐ-కంప్యూట్ హబ్‌గా మార్చాలని శాంసంగ్‌కు ప్రతిపాదన
- క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఏపీని అగ్రగామిగా నిలపడమే ధ్యేయమన్న లోకేశ్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు. సియోల్‌లో ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్‌తో సమావేశమై...

## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు..

### 38 మందికి మరణశిక్ష



- 11 మందికి యావజ్జీవ శిక్ష కొనసాగింపు
- 2008లో జరిగిన పేలుళ్ల ఘటన
- 56 మంది మృతి, 246 మంది గాయాలు
- బాధితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశం
- 49 మందిని దోషులు, 28 మందిని నిర్దోషులుగా తేల్చిన వైనం

2లో

2008లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను వణికించిన వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు గతంలో విధించిన 38 మంది

# సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. హస్తకళాకారులను అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలన్నారు. తొలుత అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. వంశపారం పర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఒక జాతి గొప్పతనం.. నిర్మించిన భవనాల్లో కాదు.. కళాకారుల్లో కనిపిస్తుంది. కళాకారుల ప్రతిభ.. వారి కష్టాన్ని గుర్తించడానికే ఇక్కడికి వచ్చాను. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. అద్భుత కళల వెనుక లక్షల మంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు.. వారసత్వాన్నీ సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారని అభినందించారు.రాష్ట్రంలో 2 లక్షల మందికిపైగా కళాకారులున్నారు. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దశను తీసుకొస్తాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు.. పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి.. ప్రపంచానికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు.. లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పని చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఏపీ పుట్టినిల్లు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఒక జాతి గొప్పతనం నిర్మించిన భవనాల్లో కాదని, కళాకారుల్లో కనిపిస్తుందని అభివర్ణించారు. కళాకారుల అద్భుత ప్రతిభను, వారి కష్టాన్ని గుర్తించడానికి తాను ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. హస్తకళాకారుల వస్తువుల తయారీ మాత్రమే కాకుండా, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన తీరును పవన్ కల్యాణ్ అభినందించారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ ప్రోత్సహించారు. కళాకారులతో కలిసిపోయి, వారి నైపుణ్యాలను ప్రశంసించారు. వారి విజయాలు, సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కళాకారుల కోరిక మేరకు, క్లస్టర్ల వారీగా గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఏపీ హస్తకళల అభివృద్ధికి తమ ప్రభుత్వం అవసరమైన మద్దతును అందిస్తోందని స్పష్టం చేశారు. పర్యావరణ పర్యాటకం, ఆలయ పర్యాటకం తరహాలో హస్తకళల పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. కళాఖండాలను సృష్టించే కళాకారులకు తగిన గుర్తింపు లభించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కళాకారుల పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రత్యేక డాక్యుమెంటరీలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద క్లస్టర్ల వారీగా ఉమ్మడి సౌకర్యాల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. హస్తకళల పరిరక్షణకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణ కోసం క్లస్టర్ల వారీగా నిరంతర వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల ఉత్సవంలో మొదటి అడుగుగా కాకినాడకు చెందిన తోలుబొమ్మలాట కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పవన్ కల్యాణ్ సందర్శించారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పేలా రూపొందించిన రామాయణ, మహాభారత, భాగవత కళారూపాలను పరిశీలించారు. తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రావణ వధ ఘట్టం అందరినీ ఆకట్టుకుంది. సంప్రదాయంగా తోలుబొమ్మలాటను జీవనోపాధిగా చేసుకున్న తమ కుటుంబాలు, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి చేరుకున్నాయని కళాకారులు వివరించారు. ఈ కళారూపాల గొప్పతనాన్ని ప్రదర్శించడానికి, రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో ప్రత్యేక తోలుబొమ్మలాట ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఉప్పాడ చీరల స్టాల్‌ను పవన్ కల్యాణ్ సందర్శించారు. తన సతీమణి అన్నా కొణిదెల కోసం మూడు ఉప్పాడ జామ్దానీ పట్టు చీరలను కొనుగోలు చేశారు. అరటి పీచుతో చేసిన హ్యాండ్‌బ్యాగులు, ఇతర పర్యావరణ అనుకూల ఉత్పత్తులపై ప్రత్యేక ఆసక్తి కనపరిచారు. కళాకారుల నుంచి ఉత్పత్తి పద్ధతుల గురించి ఆరా తీసి, వారి నుంచి ఒక హ్యాండ్‌బ్యాగ్‌ను కొనుగోలు చేశారు. తిరుపతి చెక్క శిల్పకారులు రూపొందించిన చెక్క బొమ్మల స్టాల్‌ను సందర్శించారు. కళాకారుల అద్భుతమైన కళాఖండాలను ప్రశంసించి, వారి నుంచి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని కొనుగోలు చేశారు. శ్రీకాళహస్తికి చెందిన కలంకారి వస్త్రాల స్టాల్ వద్ద, కలం కలంకారి కళతో రూపొందించిన వస్త్రాలు, పరుపుల షీట్లు పవన్ దృష్టిని ఆకర్షించాయి. కలంకారి నేత కళాకారుల కఠోర శ్రమ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకునేలా వీడియో డాక్యుమెంటరీలను రూపొందించాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు.

# కేరళంలో భారీ వర్షాలు

మంగళవారంమధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, మట్టి కింద కూరుకుపోయిన ఆరుగురిని స్థానికులు రక్షించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొంతమంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మలప్పురం, వయనాడ్ జిల్లాలను కలిపే సొరంగ మార్గం నిర్మాణ పనులు జరుగుతున్న మీనాక్షి వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి వయనాడ్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారీగా మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా కొండపై నుంచి కూలిపడి నిర్మాణ ప్రాంతాన్ని పూర్తిగా కప్పివేశాయి. ప్రమాదం సంభవించగానే అక్కడ ఉన్న కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కనీసం ఐదుగురు గాయపడగా, మరికొందరు మట్టిలో చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు కలిసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు ఈ ప్రమాదంపై కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీషన్ వెంటనే జిల్లా మంత్రులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక, పునరావాస చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. వయనాడ్‌కు వెళ్లి సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు అగ్నిమాపక, పోలీసు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను రంగంలోకి దింపి సహాయక చర్యలు చేపట్టారు. యనాడ్‌లో సోమవారం నుంచి భారీ వర్షాలు పడుతుండగా సొరంగం పనులను అదే రోజు నుంచి ప్రాజెక్టు అధికారులు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సొరంగ మార్గం ప్రాజెక్టు కోసం పని చేసే కార్మికులు నివసించే వసతి గృహంపై కొండచరియలు పడ్డాయి. అలాగే, కొన్ని నివాస గృహాలు, హోమ్‌స్టేలపైనా భారీగా మట్టి, రాళ్లు వచ్చిపడ్డాయి. దీంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. మరోవైపు శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు, స్థానికులు ఉండొచ్చని సహాయక చర్యలు చేపట్టిన అధికారులు భావిస్తున్నారు. అనేక వాహనాలు, ఇళ్లు దెబ్బతినగా.. నష్టాన్ని అధికారులు ఇంకా అంచనా వేయలేదు. శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కొండచరియల కింద చిక్కుకున్న కొంతమంది కార్మికులను సహాయక సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వీటికి ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో దాదాపు 100 మంది నివసిస్తున్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొండచరియల కారణంగా మలప్పురం – వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు, మీనాక్షి వంతెన వద్ద నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వయనాడ్‌లో 2024లోనూ కొండచరియలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. నాడు ముండక్కై, చూర్‌మాలా ప్రాంతాల్లో బండరాళ్లు విరిగిపడి 298 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. భారీ వర్షాల కారణంగా రెస్క్యూ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. భారత వాతావరణ శాఖ కేరళంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది. కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.

# హార్మ్యూజ్‌లో మళ్లీ మిస్సైళ్ల మోత

ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఒమన్ తీరానికి సమీపంలో ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (×=+ఙ) రెండు వాణిజ్య నౌకలపై క్షిపణులతో దాడులు చేసింది. ఈ ఘటనలో నౌకలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం అందగా, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, పర్యావరణానికి పెద్దగా ముప్పు వాటిల్లలేదని ప్రాథమికంగా వెల్లడైంది.అమెరికా అధికారుల కథనాల ప్రకారం, ఇరాన్ జరిపిన దాడుల్లో కనీసం రెండు నౌకలు దెబ్బతిన్నాయి. మరోవైపు, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న ఒక ఆయిల్ ట్యాంకర్‌ను గుర్తుతెలియని ప్రొజెక్టైల్ ఢీకొట్టింది. ఈ ప్రభావంతో ట్యాంకర్‌లో మంటలు చెలరేగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (ఖఖమీూ) ధృవీకరించింది. ఈ కీలక జలమార్గంలో నౌకలపై దాడులను నిలిపివేసేలా అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల ఒక అవగాహన ఒప్పందం కుదిరినప్పటికీ, కొన్ని రోజుల వ్యవధిలోనే తాజా దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. ఇరాన్ చర్యలపై అమెరికా అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చమురు, సహజవాయువు రవాణాలో అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో తరచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

# ఏపీకి పెట్టుబడుల వేట..

విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ఏపీలో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా... ఏపీని డేటా సెంటర్లు, సర్వర్ తయారీకి భారతదేశపు స్థావరంగా మార్చాలని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 150 క్యూబిట్‌ల క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు నుంచి, దాని తయారీ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్య ఆయన ఎల్జీ సైన్స్ పార్క్ లో రోబోతో ఫొటో దిగారు.

# సాయికృష్ణ కేసులో కీలక మలుపు:

**సస్పెండైన సీఐ నాగరాజును పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు సిట్‌కు అనుమతి**

**జులై 9 నుంచి 8 రోజుల పాటు విచారణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్**

**కింది కోర్టు విధించిన షరతులను సడలించిన ఉన్నత న్యాయస్థానం**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) కస్టోడియల్ డెత్ ఆరోపణల కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.వి.వి. నాగరాజును జులై 9 నుంచి ఎనిమిది రోజుల పాటు పోలీస్ కస్టడీలో విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) మంగళవారం న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సీఐ నాగరాజును కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో విచారించనున్నారు. గతంలో విజయవాడలోని దిగువ కోర్టు నాగరాజును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే విచారించాలని, ఆ ప్రక్రియను ఆడియో–వీడియో రికార్డింగ్ చేయాలని షరతులు విధించింది. అయితే, ఈ నిబంధనల వల్ల సాక్ష్యాధారాల సేకరణతో పాటు క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ వంటి ప్రక్రియలకు ఆటంకం కలుగుతుందని సిట్ హైకోర్టును ఆశ్రయించింది. సిట్ తరఫు వాదనలతో ఏకీభవించిన జస్టిస్ కుంచం మహేశ్వరరావు, దిగువ కోర్టు విధించిన షరతులను సడలిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

**కేసు నేపథ్యం** వివిధ కేసుల విచారణ నిమిత్తం విజయవాడకు చెందిన సాయికృష్ణను పోలీసులు మార్కాపురంలో అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి అతను అదృశ్యమయ్యాడు. తన కుమారుడిని విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి చంపేశారని, ఆ తర్వాత సాక్ష్యాలను నాశనం చేసేందుకు మృతదేహాన్ని విద్యుత్ శ్మశానవాటికలో రహస్యంగా దహనం చేశారని సాయికృష్ణ తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు జూన్ 19న హత్య, అక్రమ నిర్బంధం, సాక్ష్యాల ధ్వంసం వంటి అభియోగాలపై బీఎన్ఎస్ కింద కేసు నమోదైంది. ప్రభుత్వం నియమించిన సిట్ బృందం, జూన్ 23న సీఐ నాగరాజుతో పాటు అతనికి సహకరించిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను అరెస్ట్ చేసింది.

# టెక్కీ రాధాగాయత్రి మృతి కేసు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాధాగాయత్రి తన భర్తతో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి ట్రిప్‌నకి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే రాధాగాయత్రి మృతిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తె మృతికి అల్లుడు శ్రీచరణ్ కారణం అంటూ ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే, ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పూర్తిస్థాయి నిజానిజాలు వెలికితీసేందుకు డెహ్రాడూన్ జిల్లా కలెక్టర్ రాహుల్ ఆనంద్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. ఈ నిర్ణయంతో కేసు దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. మసూరిలో జూన్ 14వ తేదీ నుంచి 16వ తేదీల మధ్య అసలు ఏం జరిగిందనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణను మసూరి డివిజనల్ మేజిస్ట్రేట్ నిర్వహిస్తున్నారు. రాధాగాయత్రి మరణానికి దారితీసిన పరిస్థితులు, ఆమె మృతికి ముందు, ఆ తర్వాత జరిగిన పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా రాధాగాయత్రి మృతికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు పరిశీలించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆమె ఆరోగ్య పరిస్థితి, ప్రయాణ వివరాలు, ఘటన జరిగిన సమయంలో ఆమెతో ఉన్న వ్యక్తులు, ఆస్పత్రి రికార్డులు తదితర అంశాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

# కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

**కెసిఆర్ సరేనంటే..ఎంత సమయమైనా కేటాయిస్తాం**

**కెసిఆర్ వాదన సరైనదయితే ..ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం**

**కాళేశ్వరం కమిషన్ల ప్రాజెక్ట్ అన్న సిఎం రేవంత్ రెడ్డి**

**నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు**

**కెటిఆర్, హరీష్ రావులు ఆర్థిక ఉగ్రవాదులని విమర్శలు**

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సిఎం రేవంత్ విమర్శలు**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్ట్‌ను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్ట్ ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతున్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్ధాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్ధాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు. అబద్ధాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని రేవంత్ చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖాతాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# చరిత్ర సృష్టించిన మోదీ..

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# ఎయిర్ జర్నీకి అంతా రెడీ !

ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ..

పాలసీని రూపొందించాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి వంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సోలార్ సెల్స్ తయారీలో ఏపీని అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు..
## 38 మందికి మరణశిక్ష

దోషులకు మరణశిక్షను సమర్థించింది. మరో 11 మందికి జీవిత ఖైదు శిక్షను ఖరారు చేసింది. ఈ పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోగా.. 246 మంది గాయపడ్డారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.1 లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ మొత్తం 2027 మార్చి 31లోపు చెల్లించాలని ఆదేశించింది. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో పలు ప్రాంతాల్లో వరుస పేలుళ్లు జరిగాయి. రెండు రోజుల తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలపై నమోదైన 35 కేసులను కలిపి ఒకే విచారణగా చేపట్టారు. దర్యాప్తులో వంద మందికిపైగా నిందితులను గుర్తించగా, 78 మందిపై విచారణ జరిగింది. 2022 ఫిబ్రవరిలో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి 28 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) మాజీ నాయకుడు సఫ్దర్ నాగోరి కూడా దోషుల్లో ఒకడు. సిమికి చెందిన కొందరు సభ్యులు కలిసి ఇండియన్ ముజాహిదీన్ పేరుతో కొత్త సంస్థ ఏర్పాటు చేసి ఈ దాడులకు పాల్పడినట్లు పోలీసులు ఆరోపించారు. హత్య, హత్యాయత్నం, దేశంపై యుద్ధానికి యత్నం, దేశద్రోహం, ఉగ్రవాద కార్యకలాపాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు, పేలుడు పదార్థాల చట్టం తదితర కేసుల్లో నిందితులు దోషులుగా తేలారు. ఈ కేసు విచారణ దాదాపు పదేళ్లకు పైగా సాగింది. తొమ్మిది మంది న్యాయమూర్తుల ఎదుట 1,163 మంది సాక్షులను విచారించారు. వీరిలో 26 మంది కీలక సాక్షుల వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచారు. పేలుళ్ల తర్వాత పంపిన ఈ–మెయిళ్లలో 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పేర్కొన్న విషయం కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చింది.

# పులిమద్ది ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అక్రమ హాజరుకు బాధ్యులు నంద్యాల ఎంఈఓ బ్రహ్మంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



బహుజన టీచర్స్ ఫెడరేషన్

**నంద్యాల సిటీ బ్యూరో జులై 7 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా నంద్యాల మండలం పులిమద్ది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేకపోయినా ఉన్నట్లు హాజరు చూపుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం అభినందనీయమని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ తెలిపారు. కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ పులిమద్ది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేకున్నా అక్రమంగా హాజరు వేస్తున్న అంశంలో పర్యవేక్షణ అధికారిగా ఉంటూ నంద్యాల మండల విద్యాధికారి బ్రహ్మం తన విధులు నిర్వర్తించకపోవడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుచున్నాయని ఆరోపించారు. గతంలో గడివేముల ఇన్చార్జి ఎంఈఓ గా ఉన్నప్పుడు కొరటమద్ది పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఫిర్యాదులు చేస్తే, తమ తప్పులు బయటపడతాయని ఏకంగా 6,7,8 తరగతుల విద్యార్థులకు టిసీలు ఇచ్చి యూపీ స్కూల్ ను ప్రైమరీ స్కూల్ గా డిగ్రేడ్ చేసిన ఘనత అప్పటి ఉపాధ్యాయులు మరియు బ్రహ్మం గారి దక్కుతుందని అన్నారు. అంతేకాకుండా కొరటమద్ది పాఠశాల విషయంలో విచారణ చేపట్టిన అప్పటి రాయచోటి డిప్యూటీ వరలక్ష్మి గారు స్కూల్లో జరిగిన ఘటనలకు బాధ్యులు అప్పటి హెచ్.ఎం శైలజ మరియు ఎంఈఓ బ్రహ్మం అని తన రిపోర్ట్ సమర్పించి నేటికీ నాలుగేళ్లు గడుస్తున్న , కడప ఆర్జేడి ఎలాంటి చర్యలు తీసుకోకుండా పైరవీలకు పాల్పడుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అందువలననే పులిమద్ది స్కూల్ లాంటి ఘటనలు ఎన్నో జరుగుచున్నాయని అన్నారు. తక్షణమే పులిమద్ది స్కూల్ ఘటనకు బాధ్యులైన ఎంఈఓ బ్రహ్మంపై చర్యలు తీసుకోవాలని బి.టి.ఎఫ్ డిమాండ్ చేసింది. అంతేకాకుండా గతంలో రాయచోటి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి గారు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా హెచ్.ఎం శైలజ మరియు ఎంఈఓ బ్రహ్మం లపై కఠిన చర్యలు తీసుకోవాలని కడప ఆర్జేడీకి బహుజన టీచర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. కె. సతీష్ కుమార్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు దీఖీ సెల్. 70934 64562

# ప్రజలకు చేరువలో తపాలా సేవలు..

### నెట్,మొబైల్ బ్యాంకింగ్ సేవలు సద్వినియోగం చేసుకోండి.

### ఆత్మకూరు తపాలా సహాయ సూపరెంటెంట్ పి.మదన్ మోహన్



**మర్రిపాడు జులై 07నంది పత్రిక :** నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలంలోని మర్రిపాడు పోస్ట్ ఆఫీస్ సిబ్బందికి బ్రాంచి పోస్ట్ ఆఫీస్ సిబ్బందిని సమావేశపరిచి ప్రజలకు తపాలా సేవలను అందించాలని ఆత్మకూరు తపాలా సహాయ సూపరెంటెంట్ పి. మదన్ మోహన్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రజలందరూ తపాలా సేవలైన డిజిటల్ సేవింగ్స్ బ్యాంకు ఖాతాలు మరియు తపాలా/ గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఖాతాదారులందరూ వారి పాసుబుక్ లోని నిల్వలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని నెట్,మొబైల్ బ్యాంకింగ్ ద్వారా డిజిటల్ ఖాతాలు ఎలా ఓపెన్ చేయాలో ఖాతాదారులకు తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించడం జరిగింది ఈ సమావేశంలో పోస్టుమాస్టర్ ప్రనయ్ కుమార్, మెయిల్ ఓవర్సీస్ రామకృష్ణారెడ్డి, రామాయణం అన్వేష్ కుమార్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మరియు ఇతర తపాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కోత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పరిపాలనా లోపాలు, రాజకీయ జోక్యంపై వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కిషోర్ ఆవేదన.

**ఆలయ చరిత్రను విస్మరించి, ఆలయ నిర్మాణానికి కారణమైన బీరం చెన్నారెడ్డి పేరును ప్రస్తావించకపోవడం బాధాకరమని విమర్శ.**

**కేవలం వేలలో విరాళం ఇచ్చిన దాతల పేర్లకే ప్రాధాన్యం ఇవ్వడం చరిత్రను విస్మరించడమేనని వ్యాఖ్య.**

**హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే జీర్ణోద్ధరణ కమిటీ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఆరోపణ.**

**రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈవో వ్యవహరిస్తున్నారని కిషోర్ విమర్శ.**

**ఆలయ ప్రాకార గోడపై రాజకీయ నాయకుల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయడం హిందూ సంప్రదాయాలను అవమానించడమేనని మండిపాటు.**

**అభివృద్ధి పనులకు వినియోగించిన నిధులు దేవాదాయ శాఖవేనని, వ్యక్తిగత నిధులు కావని స్పష్టం.**

**దేవాలయాలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చవద్దని, చట్టబద్ధమైన పరిపాలన అమలు చేయాలని దేవాదాయ శాఖకు వీహెచ్‌పీ డిమాండ్.**

**నంద్యాల సిటీ బ్యూరో జులై 7 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లాలోని శ్రీ కోత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో చోటుచేసుకుంటున్న పరిపాలనా లోపాలు, రాజకీయ జోక్యంపై విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా కార్యదర్శి కిషోర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వందల ఏళ్ల క్రితం స్థానిక రైతు బీరం చెన్నారెడ్డి తన పొలంలో స్వామివారి విగ్రహాన్ని గుర్తించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అలాంటి చారిత్రక సేవ చేసిన వ్యక్తి పేరును దేవాదాయ శాఖ ఎక్కడా ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. మరోవైపు కేవలం రూ.25 వేల విరాళం ఇచ్చిన దాతల పేర్లను మాత్రం ఆలయ గోడలపై ప్రదర్శించడం చరిత్రను విస్మరించడమేనని అన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబ సభ్యులు దాఖలు చేసిన కేసు హైకోర్టులో విచారణలో ఉండగానే, ఆలయ ఈవో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి జీర్ణోద్ధరణ కమిటీ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఆరోపించారు. ఇది న్యాయస్థానాన్ని ధిక్కరించిన చర్యగా పరిగణించాలని అన్నారు. అలాగే ఆలయంలోని శివాలయం ప్రాకార గోడపై రాజకీయ నాయకుల పేర్లతో కూడిన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి పనులకు వినియోగించిన నిధులు దేవాదాయ శాఖకు చెందినవని, అవి ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిగత నిధులు కాదని గుర్తుచేశారు. దేవాలయాల వంటి పవిత్ర స్థలాలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చడం హిందూ సంప్రదాయాలను అవమానించడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



ఈ అంశాలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆలయ చరిత్రకు తగిన గౌరవం కల్పించడంతో పాటు, రాజకీయ జోక్యాన్ని అరికట్టి చట్టబద్ధమైన పరిపాలనను అమలు చేయాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కిషోర్ డిమాండ్ చేశారు.




# మర్రిపాడులో మెగా డిజిటైజేషన్ డ్రైవ్.. నేడు, రేపు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు

### ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్ అనిల్ కుమార్...



**మర్రిపాడు జూలై 7 నంది పత్రిక :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమంలో భాగంగా ఇంకా డిజిటైజేషన్ పూర్తికాని ఎన్యూమరేషన్ ఫారాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయడానికి మర్రిపాడు మండలంలో జూలై 7, 8 తేదీల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ కమ్ మెగా డిజిటైజేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పత్రికా ప్రకటనలో తెలిపారు.ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మండలంలోని 25 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేక నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు.మండలంలో మొత్తం 23,330 మంది ఓటర్లకు సంబంధించి 23,014 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, ప్రస్తుతం 11,211 ఫారాలు డిజిటైజేషన్‌కు పెండింగ్‌లో ఉన్నాయని, మొత్తం పెండింగ్ 48.05 శాతంగా ఉందని వెల్లడించారు. ప్రతి రోజు 5,606 ఫారాలను డిజిటైజ్ చేయడం లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు.ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని వారు లేదా డిజిటైజేషన్‌కు అవసరమైన వివరాలు అందించని ఓటర్లు సంబంధిత బూత్ లెవల్ అధికారులు (దీూాలు), గ్రామ అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఇంటికి వచ్చినప్పుడు సహకరించాలని, లేదా నిర్ణీత సమయంలో సంబంధిత హెల్ప్ డెస్క్ కేంద్రాలకు వెళ్లి ఎన్యూమరేషన్ ఫారంతో పాటు ఒక కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫోటో సమర్పించి ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.ఎన్యూమరేషన్ ఫారాల నింపడం కోసం ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజాహిత పనులకు తోడ్పడాలి

### కర్నూలు నగరాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం


### కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. మంగళవారం ఆయన ఏ.క్యాంపు, మారుతి మెగా సిటీ, వెంకటరమణ కాలనీ, జొహరపురం ప్రాంతాల్లో పారిశుద్ధ్య, మౌలిక వసతుల పనులను పరిశీలించారు.ఒమేగా ఆసుపత్రి ఎదురుగా ప్రజారోగ్యం, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన మురుగునీటిని తొలగించే చర్యలను పరిశీలించారు. జొహరపురం రోడ్డులో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఎడమ వైపున ఉన్న డ్రైన్‌తో అనుసంధానం చేసే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కొండారెడ్డి బురుజు పార్కు వద్ద డిజిటల్ స్క్రీన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సానుకూలంగా స్పందించి అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో నగరాభివృద్ధి పనులు మరింత వేగవంతంగా పూర్తై మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ఏఈ రాంమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



# జననేత కు చిత్రాంజలి



**నంద్యాల ప్రతినిధి. జూలై 07 . (నంది పత్రిక ):** నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు హంస అవార్డు గ్రహీత కళారత్న చింతలపల్లె కోటేష్ జులై 8 న దివంగత నేత ముఖ్యమంత్రి వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని 14 అంగుళాల పొడవు,11 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్టు మీద మైక్రో పెన్ను తో, కలర్ పెన్సిల్స్ లతో వై. ఎస్. రాజశేఖరరెడ్డి 8 పొట్రాయిట్ చిత్రాలను వేశారు. అలాగే ఆయన అభిమాన ప్రజలు వైస్సార్ ని స్మరించుకున్నట్లు వేసారు..ఈ చిత్రం వేయడానికి 6 గంటల సమయం పట్టిందన్నారు.ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ ఈ చిత్రంలో రాజన్న ఎంతో సంతోషం గా తన ధైన శైలి లో నవ్వు తున్నట్లు వేసాను. అలాగే బాల్యం లో, ఎన్ సీ సీ డ్రస్ లో ఉన్నట్లు, వైద్య విద్యార్థిగా వున్నప్పుడు, డాక్టర్ గా వున్నప్పుడు, యవ్వనంలో రాజకీయ ప్రవేశంలో వున్నప్పుడు, అలాగే చిరునవ్వు తో రాజసమైన ఠీవితో వున్నట్లు, చివరిగా ప్రజలకు నమస్కారం చేస్తున్నట్లు వేసాను. ఇలా ఆయన బాల్యం నుండి కడసారి వరకు ఎలా వున్నారో వేసాను. అలాగే ప్రజలు తమ ప్రియతమ నేత వై. ఎస్. రాజ శేఖర్ రెడ్డి జయంతిని గుర్తు చేసుకుంటూ స్మరించుకున్నట్లు వేసాను.రాజన్న ను స్మరించుకుంటున్న ప్రజలలో నేను కూడా ఈ చిత్రం లో వున్నట్లు వేసాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా రెండు సార్లు బాధ్యతలు స్వీకరించి అనేక సంక్షేమ పథకాలు పెట్టి పేద,మధ్య ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆరోగ్య శ్రీ నుండి 108 వరకు, ఫీజు రీయింబర్స్ మెంట్ నుండి రుణమాఫి వరకు ఇలా చెప్పు కుంటూ పోతే చాలా పథకాలు వున్నాయి. ఆయన ప్రవేశ పెట్టిన పథకాలు మాత్రం చరిత్రలో నిలిచి పోయాయి. గురజాడ అప్పారావు అన్నట్లు "వట్టి మాటలు కట్టి పెట్ట వోయ్ గట్టి మేలు తల పెట్ట వోయ్ " అన్నారు.వైస్సార్ వట్టి మాటల మనిషి కాదు చేతల మనిషి. హామీ ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నారు.అందుకే ఆయన అభిమాన ప్రజలు ఆ మహానేతను ఎప్పటికి మరచిపోరు.ప్రజల హృదయాల్లో శాశ్వతంగా వుంటారు.రాజన్న అభిమానిగా ప్రతి జయంతి రోజున, వర్ధంతి రోజున ఆయన చిత్రం వేసి చిత్రానివాళ్లు అర్పిస్తూ వుంటాను.



# 'ఎన్యూమరేషన్ ఫారం' కోసం సచివాలయాన్ని సంప్రదించండి

### ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు 'బుధవారం' సమీప సచివాలయంలో పొందాలి

### ఈసీఐ వెబ్‌సైట్‌లో సైతం ఎన్యూమరేషన్ ఫారం సమర్పించవచ్చు

### ఓటర్లకు కర్నూలు ఈఆర్వో చల్లా ఓబులేసు విజ్ఞప్తి



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారం ఇంకా అందని ఓటర్లు ఉంటే బుధవారం సమీప సచివాలయంలో సిబ్బందిని సంప్రదించి ఫారం పొందాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. మంగళవారం ఆయన చాకలి వీధి, కొత్తపేట రైతుబజార్ పరిసరాల్లోని 161, 163, 166 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా, అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లకు బుధవారం సమీప సచివాలయంలో ఫారం పొందేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.అదేవిధంగా కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ హ్ట్ట్జూం://జశేవతీం.వఝఱ.న్రశీజ.ఱఅ/ ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూరించి సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు మంగళవారం నుంచి 10 ఆటోల ద్వారా మైక్ ప్రచారం ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జి.ఎం. శ్రీకాంత్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్న రావణ్ అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట...

### చట్టాన్ని ప్రతిపక్షాల గొంతు నొక్కే ఆయుధంగా మార్చవద్దు...

### సీపీఐ జిల్లా కార్యదర్శి. ఎన్ రంగనాయుడు



**నంద్యాల ప్రతినిధి. జూలై 07 . (నంది పత్రిక ):**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే రాజకీయ ఉద్దేశంతో ప్రశ్న రావణ్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన తీవ్ర దాడి అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు. ఎస్.బాబా ఫకృద్దీన్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ విధానాలను, వైఫల్యాలను ప్రశ్నించే వారిపై రాజద్రోహం వంటి తీవ్రమైన కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శలను రాజకీయంగా ఎదుర్కోవాల్సింది పోయి, పోలీసు వ్యవస్థను ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేయడం రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడేనని అదే తరహా లేదా అంతకంటే తీవ్రమైన వ్యాఖ్యలు అధికార పార్టీ నాయకులు చేసినప్పుడు ప్రభుత్వం స్పందించకపోవడం, ప్రతిపక్షాల విషయంలో మాత్రం చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విమర్శించారు.అధికారంలో ఉన్నవారికి ఒక న్యాయం, ప్రతిపక్షాలకు మరో న్యాయం అమలు చేయడం రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాన్ని అవమానించడమేనని ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరం కాదని, ప్రజల తరపున మాట్లాడే గొంతులను కేసులు, అరెస్టులతో అణచివేయాలని చేసే ప్రయత్నాలు చివరికి ప్రజాస్వామ్య వ్యవస్థనే బలహీనపరుస్తాయని భిన్నాభిప్రాయాలను చర్చతో ఎదుర్కొనే బదులు నిర్బంధాలతో సమాధానం చెప్పడం అధికార అహంకారానికి నిదర్శనమని అన్నారు.ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, రాజకీయ కక్షసాధింపుతో కొనసాగుతున్న వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.చట్టాన్ని అధికార పార్టీకి రక్షణ కవచంగా, ప్రతిపక్షాలకు శిక్షా ఆయుధంగా ఉపయోగించే ధోరణిని వెంటనే విరమించుకోవాలని ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రశ్నించే హక్కును గౌరవించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం




**నంద్యాల ప్రతినిధి. జూలై 07 . (నంది పత్రిక ):**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, జులై 9న ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, నంద్యాల పట్టణం, ఎన్జీవో కాలనీలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువభారత్ జిల్లా ఎంపిక నెంబర్ సాయినాథ్ మాట్లాడుతూ, స్వామి వివేకానంద జీవితంలోని ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించి, వివేకానంద జీవితాన్ని మనం ఏ విధంగా ఆదర్శంగా తీసుకోవాలి వివరించారు.మరియు ఏబీవీపీ ఎలా ఆవిర్భవించిందో విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ మనేష్ నాయుడు, పార్థు, జిల్లా కన్వీనర్ లక్ష్మీనరసింహ పలువురు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో యువభారత్ జిల్లా ఎంపిక నెంబర్ సాయినాథ్ గారు మాట్లాడుతూ, స్వామి వివేకానంద గారి జీవితంలోని ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించి, వివేకానంద గారి జీవితాన్ని మనం ఏ విధంగా ఆదర్శంగా తీసుకోవాలి వివరించారు మరియు ఏబీవీపీ ఎలా ఆవిర్భవించిందో విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ మనేష్ నాయుడు, పార్థు, జిల్లా కన్వీనర్ లక్ష్మీనరసింహ పలువురు పాల్గొన్నారు.

## వైద్యులకు నంద్యాల లయన్స్ క్లబ్ పురస్కారాలు

**పురస్కారాలు అందుకున్న డాక్టర్ అలీ భాష, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ కామిని నాగార్జున, డాక్టర్ ఉయ్యాలవాడ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ గురు ప్రసాద్**

**వైద్యుల సత్కార కార్యక్రమానికి సహకరించిన సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యుడు కుంచా మహేశ్వరరెడ్డి**



**నంద్యాల సిటీ బ్యూరో జులై 7 ( నంది పత్రిక )** జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఎంపిక చేసిన ఐదు మంది వైద్యులకు లయన్స్ క్లబ్ వైద్యుల దినోత్సవ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు కుంచా మహేశ్వరరెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ అలీ భాషా, ప్రముఖ ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి,డాక్టర్ ఉయ్యాలవాడ శ్రీధర్ రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ కామిని నాగార్జున, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ గురు ప్రసాద్ లకు లయన్స్ క్లబ్ వైద్యుల దినోత్సవం పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి,వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ,ఈ కార్యక్రమానికి సహకరించిన కుంచా మహేశ్వరరెడ్డి,లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్,సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, రీజనల్ చైర్మన్ పీవీ సుధాకర్ రెడ్డి, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్, లయన్స్ జిల్లా గ్లోబల్ మెంబర్ షిప్ కోఆర్డినేటర్ రవి ప్రకాష్, అధిక సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ పరీక్షల మహా శిబిరం ఆరోగ్యమే మహాభాగ్యం

### నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**నంద్యాల ప్రతినిధి. జూలై 07 . (నంది పత్రిక ):**సమాజ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రాయలసీమ ఫౌండేషన్ సహకారంతో రూ.15,000 విలువైన ఉచిత క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు.నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉచిత వైద్య శిబిరం తేదీలు, ఈ నెల 12 వ తేదీ నందికొట్కూరు నియోజకవర్గం నెహ్రూ నగర్ గ్రామంలో, ఈ నెల 13 వ తేదీ నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ లో, ఈ నెల 14 వ తేదీన డోన్ పట్టణంలో ప్రత్యేకంగా ఉచిత కాన్సర్ పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, ముందస్తు పరీక్షల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.



# వెలుగోడు జడ్పీ హైస్కూల్‌లో ‘శక్తి యాప్‘ అవగాహన సదస్సు





### ఆకతాయిలు వేధిస్తే ‘శక్తి యాప్‘ ద్వారా ఫిర్యాదు చేయండి: పోలీస్ సిబ్బంది పిలుపు.

**వెలుగోడు, జులై 07 (నంది పత్రిక):** నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఉత్తర్వుల ప్రకారం... ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ సురేష్ పర్యవేక్షణలో వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో “శక్తి యాప్ అవగాహన కార్యక్రమం“ మంగళవారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మాలిక్ ఖాన్, ఉపాధ్యాయ బృందం, వెలుగోడు-రేగడగూడూరు ఐసీడీఎస్ సూపర్వైజర్లు జయలక్ష్మి, వినోలియా ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆత్మకూరు శక్తి టీం సిబ్బంది ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, 3వ సచివాలయం మహిళా పోలీస్ బి. రమాదేవి పాల్గొని సుమారు 300 మంది విద్యార్థినులకు, విద్యార్థులకు పలు సామాజికాంశాలు, చట్టాలపై విస్తృత అవగాహన కల్పించారు.

**మహిళా రక్షణే ధ్యేయం ‘శక్తి యాప్‘** ఈ సందర్భంగా శక్తి టీం సిబ్బంది మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ‘శక్తి యాప్‘ను తీసుకువచ్చిందని తెలిపారు. ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో ఈ యాప్‌ను ఎలా డౌన్లోడ్ చేసుకోవాలి, అత్యవసర సమయాల్లో దీన్ని ఎలా ఉపయోగించాలనే విషయాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఆడపిల్లలను ఈవిటీజింగ్ పేరుతో ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే ఏమాత్రం అధైర్యపడకుండా శక్తి యాప్ ద్వారా లేదా పోలీసులను ఆశ్రయించి సహాయం పొందవచ్చని భరోసా ఇచ్చారు.

**ముఖ్యమైన అత్యవసర నంబర్లు:**

శక్తి యాప్ వాట్సాప్ నంబర్: 7993485111

చైల్డ్ లైన్ (బాల్య వివాహాలు/చిన్న పిల్లలపై నేరాలు): 1098 ఉమెన్ వెల్ఫేర్ (మహిళా సంక్షేమం): 181

ఎమర్జెన్సీ రెస్పాన్స్: 112 / 100 సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్: 1930

**బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం:** 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని, ఒకవేళ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 112 లేదా 1098 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. అలాగే బాధితులకు తక్షణ సహాయం అందించే ‘వన్ స్టాప్ సెంటర్‘ ప్రాముఖ్యతను వివరించారు.

**సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!** ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు ఎక్కువవుతున్నాయని, తల్లిదండ్రుల మొబైల్ వాట్సాప్‌లకు వచ్చే తెలియని లింకులు, ఫేక్ కాల్స్, అనుమానాస్పద. ఎపికే ఫైల్స్ ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని విద్యార్థులను హెచ్చరించారు. వీటివల్ల ఆర్థికంగా భారీ నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి ఫిర్యాదు చేయాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష! విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెలగుతూ, తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ చదువుపైనే ధ్యాస పెట్టాలని సూచించారు. అదేవిధంగా తమ ఇళ్లలో తల్లిదండ్రులు బైక్‌లపై వెళ్లేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించేలా విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కోర్టు ద్వారా రూ. 10,000 జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పదోన్నతి పొందిన డీడీ, డిపిఆర్వో లకు ఆత్మీయ వీడ్కోలు, సన్మానం



**కడప, బ్యూరో చీఫ్ జూలై 7 నంది పత్రిక:** కాకినాడ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన పద్మజ, అన్నమయ్య జిల్లా డీపిఆర్వోగా పదోన్నతిపై వెళుతున్న సునీల్ సాగర్ లకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక కాలెక్టరేట్ ప్రాంగణంలోని సమాచార పౌరసబంధాల శాఖ కార్యాలయంలో.. డీఐపిఆర్వోగా పనిచేసి పదోన్నతిపై డిడిగా కాకినాడ జిల్లాకు వెళ్తున్న బి. పద్మజకు, అలాగే ఇక్కడ డీఎల్ పిఆర్వోగా పనిచేస్తూ డిపిఆర్వోగా పదోన్నతి పొంది మదనపల్లె వెళుతున్న సునీల్ సాగర్ లకు.. ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడుకోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చాలు అందించి దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా.. పలువురు అధికారులు, సిబ్బంది వారి మనోభావాలను వ్యక్తం చేస్తూ పదోన్నతి పొందిన వారితో విధి నిర్వహణలో వారితో ఎదురైన అనుభవాలు, అనుబంధాన్ని అందరితో పంచుకున్నారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా.. శాఖాధిపతిగా డీఐ పిఆర్వో పద్మజ, డివిజనల్ పిఆర్వోగా సునీల్ సాగర్ లు వారి విధుల్లో చేసిన అమూల్యమైన సేవలను కొనియాడారు. పదోన్నతిపై వెళుతున్న ప్రాంతాల్లో కూడా వారు అత్యున్నత సేవలను అందించి అందరి ఆదరాభిమానాలు చురగొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీడీ పద్మజ మాట్లాడుతూ.. కడప కార్యాలయంలో విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటు న్నానన్నారు. మీ అందరి సహకారం, సమన్వయంతో ఇంతకాలం.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన అధికార విధులను నిర్వర్తించగలిగానన్నారు. ప్రతి అధికారికి బదిలీ అనేది సర్వ సాధారణమే అయినా.. ఒక సంవత్సర కాలం పాటు ఈ కార్యాలయంలో అందరితో కలిసి పనిచేసిన అనుభవం ఒక కుటుంబ వాతావరణాన్ని తలపించిందన్నారు. ఈ ప్రాంత వాతావరణం, ఇక్కడి మీడియా మిత్రుల అభిమానం, అధికారులు సిబ్బంది సమన్వయ సహ కారం.. తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. డిపిఆర్వో సునీల్ సాగర్ మాట్లాడుతూ.. కడప సమాచార శాఖ కార్యాలయంలో అందరూ బాధ్యతాయుతంగా పనిచేసే వారేనన్నారు. అందరూ కలిసికట్టుగా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. సర్వీసులో ఉన్న ప్రతి ఒక్కరికీ బదిలీలు సర్వ సాధారణం అయినప్పటికీ.. అత్యుత్తమ సేవలు అనేవి వారి పదోన్నతులకు సహకరిస్తాయని, ఆ దిశగా సిబ్బంది పారదర్శకంగా సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఇఐఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా, ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, కృపాకర్, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, టీఏ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ పాల్గొన్నారు.



## ప్రత్యేక ఓటర్ల సవరణ ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియను గడువు లోపు పూర్తి చేయాలి.

### 167- నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జులై 7 నంది పత్రిక** ప్రత్యేక ఓటర్ల సవరణ ( ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని గడువు లోపు పూర్తి చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తిరుపతి నియోజకవర్గ పరిధిలోని పూలవాణి గుంట, కొరమేనుగుంట, కొర్లగుంట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అన్ని చోట్ల ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. దశలవారీగా బిఎల్ఏలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వ్యక్తిగతంగా కలిసి వారికి అవసరమైన మార్గదర్శకాలు, అవగాహన కల్పించాలని తెలిపారు. అందరూ ఈ ప్రక్రియను ఎటువంటి అవకతవకలు జరగకుండా, జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.లు లలిత, శిల్ప, బూత్ లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## నరసాపురంలో వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

**రుద్రవరం ప్రతినిధి జులై 07 (నంది పత్రిక):** మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సై జయప్ప వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాసులు (28) అనే వ్యక్తి, గత ఆదివారం (05.07.2026) ఉదయం 07.00 గంటల నుండి 09.00 గంటల మధ్యలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, కనిపించకుండా పోయాడని అతని తండ్రి గుర్రం పెద్ద రాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయప్ప తెలిపారు.



## కరాటేలో జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలకు ప్రియదర్శిని పాఠశాల విద్యార్థులు



**బనగానపల్లె జులై 7 నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలోని ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎన్. సాయి రితేష్ మరియు 5వ తరగతి విద్యార్థిని ఎన్. నిహార కరాటేలో రాష్ట్ర స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరాటే కోచ్ ఎం. సూర్య వంశీ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కోచ్ మాట్లాడారు.కరాటే శిక్షణలో వీరు 6వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ మరియు జాతీయ సెలెక్షన్2026లో పాల్గొని అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిన వీరు ఆగస్టు 7 నుండి 9 వరకు పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపికయ్యారని తెలిపారు.విద్యార్థుల ఈ విశిష్ట విజయంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ, జాతీయ స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోఎం. కెస్సర్లింగ్, కరస్పాండెంట్డి. సబేరా, ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి



**నంద్యాల ప్రతినిధి. జూలై 07 . (నంది పత్రిక ):**నంద్యాల లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల చైర్మన్ నారాయణ స్వామి తో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల సంఘాలతో సమావేశమై దివ్యాంగుల సమస్యల పైన చర్చించడం జరిగినది. అందులో ప్రధానంగా దివ్యాంగుల హక్కుల చట్టం 2016 అమలు, దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు మంజూరు, దివ్యాంగుల ఉదిద్ కార్డ్స్, దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ అమలు గురించి, దివ్యాంగుల ఉద్యోగస్తుల సమస్యల గురించి, దివ్యాంగుల రోస్టల్ పాయింట్ గురించి దివ్యాంగులకు కమ్యూనిటీ హాల్ సమస్యల పైన దివ్యాంగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన చర్చించి సమస్యలను పరిష్కరించాలని దివ్యంగా సంఘాల నాయకులు మెమోరాండం చైర్మన్ నారాయణస్వామికి ఇవ్వడం జరిగినది. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి, ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, రాయలసీమ వికలాంగుల సేవా సమితి అధ్యక్షులు బాలసుబ్బయ్య, డి ఈ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, వికలాంగుల ఆదరణ సేవా సమితి అధ్యక్షులు మరియదాసు, హ్యూమన్ రైట్స్ దివ్యాంగుల విభాగమ అధ్యక్షులు సుధాకర్, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## తెల్లపాడులో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు



**కలసపాడు జూలై 7: (నంది పత్రిక)** వైయస్సార్ కడప జిల్లా కలసపాడు మండలం తెల్లపాడు గ్రామ పంచాయతీ ప్రజలకు తెలియజేయడమేమనగా, 8.7.2026 న ఉదయం 9 గంటల నుండి 10 గంటల లోపు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం, పూలాభిషేకం నిర్వహించి, పూలమాలలు సమర్పించడంతో పాటు కేక్ కట్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కుటుంబ సభ్యులు, బూత్ కన్వీనర్లు, మహిళా కమిటీ సభ్యులు, అవ్వాతాతలు, యువకులు, గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అమలైన 108, 104 అంబులెన్స్ సేవలు, మహిళలకు పావలా వడ్డీ, రైతులకు రుణమాఫీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే గ్రామ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు.తెలుగుగంగ ఎత్తిపోతల పథకం ద్వారా గ్రామానికి సాగునీటి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన పనులు, వన్-బీ పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. రేపు ఉదయం 9 గంటల నుండి 10 గంటల లోపు జరిగే ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, అవ్వాతాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది...ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.ఆంధ్రప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన సబ్ జూనియర్ బాలికల అంతర్ జిల్లాల ఫుట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో గెలుపొంది ట్రోఫీ సాధించిన కర్నూలు జిల్లా జట్టు పంచలింగాలలోని ఎంపీ నివాసం వద్ద ఆయనను కలిశారు..ఈ సందర్భంగా ఎంపీ ఫుట్ బాల్ ఛాంపియన్షిప్ లో విజయం సాధించిన క్రీడాకారులని అభినందించారు...అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు..ఇక మునగలపాడు వద్ద ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియం స్థలంలో ఫుట్ బాల్ కి రెండు ఎకరాలు కేటాయించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.




# సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు ప్రోటోకాల్‌కు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలి





### ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి

### హెలిప్యాడ్, తహసీల్దార్ కార్యాలయం, ప్రజా వేదికలను పరిశీలించిన రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**బనగానపల్లె/నంద్యాల, జూలై 07(నంది పత్రిక):-** రేపు బనగానపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాన్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ వీరి వెంట ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, తహసీల్దార్ కార్యాలయం, ప్రజా వేదికతో పాటు ఇతర కీలక ప్రాంతాలను సందర్శించి వివిధ శాఖల అధికారులు చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంలో, ప్రతి శాఖ అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏర్పాట్లలో నాణ్యత, సమన్వయం, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్‌కు ఎటువంటి ఆటంకాలు లేకుండా పరిసర ప్రాంతాలను పూర్తిగా సిద్ధం చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్‌కు వెళ్లే రహదారులు, బ్యారికేడింగ్, భద్రతా వలయం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య ఏర్పాట్లు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజా వేదిక వద్ద సభా ప్రాంగణాన్ని సక్రమంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, షామియానాలు, కుర్చీలు, విద్యుత్, సౌండ్ సిస్టమ్, వైద్య శిబిరం, అగ్నిమాపక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ తదితర మౌలిక వసతులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని పోలీసు శాఖకు మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అప్పగించిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట వెంటనే సవరణలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసి ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, బందోబస్తు, జనసంచార నియంత్రణ, అత్యవసర స్పందన బృందాలు, అగ్నిమాపక, వైద్య సేవలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. భద్రతా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమం జరిగే నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా ప్రతి శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం...!




### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, బ్యూరో చీఫ్ జూలై 7 నంది పత్రిక** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం విస్తృత చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.మంగళవారం విజయవాడ నుండి ఎస్ ఐ ఆర్ నిర్వహణ, పురోగతిపై.. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం 18,96,231 మంది ఓటర్లు, 2,251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 99.68 శాతం గణన పత్రాల (ఎన్యుమరేషన్ ఫారాలు) పంపిణీ పూర్తయిందని, 18,90,106 ఫారాలను పంపిణీ చేసినట్లు వివరించారు. గణన పత్రాల డిజిటలీకరణలో 59.36 శాతం పురోగతి సాధించామని, మొత్తం 11,25,558 ఫారాలు డిజిటలీకరించామని పేర్కొన్నారు.ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటర్లకు గణన పత్రాల నింపడంలో సహాయం అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసి గంట గంటకూ పురోగతిని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పనితీరు తక్కువగా ఉన్న బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వోలు) ప్రత్యేక పర్యవేక్షకులను నియమించి డిజిటలీకరణ వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. అదనంగా 54 మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులను ప్రతిపాదించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆశా, అంగన్‌వాడీ, గ్రామీణాభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల సిబ్బందిని కూడా ఓటర్లకు సహాయంగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. వలసలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఓటర్లు ఆన్‌లైన్‌లో కూడా గణన పత్రాలు సమర్పించేలా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ కార్యక్రమ పురోగతిని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. నిర్దేశిత గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు.



# పంటల బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప బ్యూరో చీఫ్, జూలై 7 నంది పత్రిక**

ఖరీఫ్2026, రబీ2026-27 పంటల సీజన్లకు అమలు చేస్తున్న పంటల బీమా పథకాలను జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటన కోరారు.

ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకోని కారణాల వల్ల పంటలకు కలిగే నష్టాల నుంచి రైతులకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పంటల బీమా పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

జిల్లాలో అర్హులైన రైతులు తమ ఆధార్, భూ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, సాగు వివరాలతో సమీపంలోని గ్రామ, వార్డు సేవా కేంద్రాలు లేదా వ్యవసాయ శాఖ కార్యాలయాలను సంప్రదించి నిర్ణీత గడువులోగా బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు అనంతరం ఇచ్చే రసీదును తప్పనిసరిగా భద్రపరచుకోవాలని తెలిపారు.

ఖరీఫ్2026 ఆహార పంటలకు ఈ ఏడాది ఆగస్టు 15 వరకు, వాణిజ్య, ఉద్యాన పంటలకు ఆగస్టు 31 వరకు బీమా నమోదు అవకాశం ఉందన్నారు.

అలాగే రబీ2026-27 ఆహార పంటలకు డిసెంబర్ 15 వరకు, ఇతర పంటలకు డిసెంబర్ 31 వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రతి పంటకు సంబంధించిన బీమా మొత్తం, రైతు చెల్లించాల్సిన ప్రీమియం, ప్రభుత్వ రాయితీ తదితర వివరాలు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, గ్రామ, వార్డు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

పంటలకు బీమా చేయించుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలను కొంత మేర అధిగమించే అవకాశం ఉంటుందని, జిల్లాలోని ప్రతి అర్హ రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోగా పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు పిలుపునిచ్చారు..

# సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యం





### జూలై 9న "సైబర్ సెక్యూరిటీ వాక్‌థాన్": జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్ జులై 7 నంది పత్రిక** సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జూలై 9వ తేదీన నిర్వహించనున్న "సైబర్ సెక్యూరిటీ వాక్‌థాన్" కార్యక్రమంలో విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు జాయింట్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వాక్‌థాన్ నిర్వహణ, అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాల్లో పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలు విస్తృతంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతకు సంబంధించిన మౌలిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లా యంత్రాంగం, యాక్సిస్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న "సైబర్ సెక్యూరిటీ వాక్‌థాన్" ఉదయం 7.00 గంటలకు భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమై అడ్డ వంతెన మీదుగా అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ వాక్‌థాన్ అనంతరం ఉదయం 10.00 గంటలకు ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో నిపుణులు, బ్యాంకింగ్ అధికారులు సైబర్ నేరస్థులు అనుసరిస్తున్న తాజా మోసపూరిత పద్ధతులు, నకిలీ ఫోన్ కాల్స్, ఓటీపీ మోసాలు, పెట్టుబడి పేరుతో జరిగే ఆన్‌లైన్ మోసాలు, క్యూఆర్ కోడ్ మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా మోసాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. అనంతరం ఉదయం 11.00 గంటలకు నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మరో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అద్నాన్ నయీమ్ అస్మి ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలకు సైబర్ భద్రతపై సందేశం ఇవ్వనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న "సైబర్ సెక్యూరిటీ వాక్‌థాన్"కు సంబంధించిన గోడపత్రికను జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, యాక్సిస్ బ్యాంక్ అధికారులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, మహిళలు,

స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

# 9న బనగానపల్లెలో ముఖ్యమంత్రి పర్యటన



**బనగానపల్లె జులై 7నందిపత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీన బనగానపల్లెలో పర్యటిస్తున్న నేపథ్యంలో సీఎం పర్యటన వివరాలను మంగళవారం బనగానపల్లె లో మంత్రి కార్యాలయం వెల్లడించింది.పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 10 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్లో బయల్దేరి బనగానపల్లె హెలిప్యాడ్ కు 11.20కి చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద 11.20 నుంచి నుంచి 11.30 వరకు ప్రజల,అధికారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తారు. 11:40 గంటలకు తహసిల్దార్ ఆఫీస్ చేరుకుని 12.15 వరకు అక్కడ అధికారులతో, రైతులతో సమీక్ష జరుపుతారు. 12.25 కు తహసీల్దార్ కార్యాలయం నుంచి బయలుదేరి సమీపంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదిక చేరుకుని 2.30 వరకు అప్పాలపురం, కాపులపల్లె రైతులకు మీ భూమి మీ హక్కు రీ సర్వే నూతన పట్టాదారు పాస్ బుక్కులు పంపిణీ చేసి ,అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సభ ముగిశాక 2.35 నుంచి 4.05వరకు పట్టణంలో పార్టీశ్రేణులతో సమావేశమవుతారు. పార్టీ శ్రేణులతో సమావేశం ముగిశాక 4.05 గంటలకు తిరిగి హెలిప్యాడ్ చేరుకుని హెలికాప్టర్ ద్వారా 5.40 కి ఉండవల్లి చేరుకుంటారని తెలిపారు.

**సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం**

**పార్టీ శ్రేణులకు ఆర్ అండ్ బి మంత్రి బిసి జనార్ధనరెడ్డి పిలుపు** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం హోదాలో నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత చంద్రబాబు 9న తొలిసారి నియోజకవర్గ కేంద్రమైన బనగానపల్లెకు మీ భూమి– మీ హక్కు రిసర్వే నూతన పట్టాదారు పాస్ బుక్ ల పంపిణీలో భాగంగా రానున్నారని పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి బీసి జనార్దన్ రెడ్డి పార్టీ క్యాడర్ కు పిలుపునిచ్చినట్లు మంత్రి కార్యాలయం మంగళవారం పేర్కొన్నారు..తెలుగుదేశం పార్టీ క్యాడర్ కూటమి మిత్రపక్షాలు ఆయన పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.మంగళవారం మంత్రి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో సిఎం రాక ఏర్పాట్లను సభావేదిక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటిసారి సిఎం చంద్రబాబు రీ సర్వే పట్టాదారు పాసుబుక్కుల పంపిణీ, అధికారులు, పార్టీ శ్రేణులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు బనగానపల్లె పర్యటనకు వస్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం పర్యటనలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ శ్రేణులుకుడా పెద్దసంఖ్యలో పాల్గొని సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు.

# అర్హులందరికీ పక్కా గృహాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి



**అమరావతి, బ్యూరో చీఫ్ జూలై 7: నంది పత్రిక** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు అందించే లక్ష్యంతో ఈప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సమచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్ధసారధి స్పష్టం చేశారు.పేదలకు పక్కా గృహాలు అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడంతో పాటు కేంద్రం నుంచి అధిక నిధులు సాధించి వారి సొంత ఇంటి కల నిజం చేయడానికి శ్రాయశక్తులా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఏపి సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014-19 మధ్య మొత్తం 13,04,516 ఇళ్లు మంజూరు చేస్తే 10వేల 194 కోట్ల రూ.లు ఖర్చు చేసి 8,04,853 ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.అందరికి ఇళ్లు అందించాలన్న ఏకైక లక్ష్యంతో ఆనాడు రూ.10వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారని గుర్తుచేశారు.అంతేకాకుండా ఎస్సీ,ఎస్టీ, బీసీలు ఇళ్ల నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 712.83 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించారన్నారు.ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ.50వేల చొప్పున, ఆదివాసి గిరిజనులకు ఇంటికి రూ.75వేల చొప్పున అందించి వారికి చేయుత నివ్వడం జరిగిందని మంత్రి పార్ధసారధి పేర్కొన్నారు. గత ప్రభుత్వం పాలనలో పరిశీలిస్తే 18లక్షల 61వేల గృహాలు మంజూరు చేయగా ఆ ప్రభుత్వ పాలన పూర్తయ్యే నాటికి అనగా 2024 మే 31 నాటికి 9వేల 588 కోట్ల రూ.లు ఖర్చు చేసి కేవలం 6లక్షల 70వేల 636 ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారని మంత్రి పార్ధ సారథి పేర్కొన్నారు.అన్నింటికన్నా అన్యాయం చంద్రబాబు ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై అయి స్వంత నిధులతో ఇంటి నిర్మాణాలు చేపట్టిన 4లక్షల 36వేల 907 మంది లబ్ధిదారుల ఇళ్లను నిర్ధాక్ష్యణ్యంగా రద్దు చేసిన గత ప్రభుత్వం పేద లబబ్దిదారులకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి స్థలాల పంపిణీకి సంబంధించి గత ప్రభుత్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 1.50 సెంట్లు,పట్టణ ప్రాంతాల్లో 1 సెంటు వంతున మహిళా లబ్దిదారుల పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల 29వేల 450 ఇంటి స్థలాలు పంపిణీ చేయగా వాటిలో 7లక్షల 89వేల 550 మందికి గృహాలు మంజూరు చేయగా ఇంకా 12లక్షల 39వేల 900 ఖాళీ స్థలాల్లో ఇళ్లు మంజూరు చేయాల్సి ఉందని మంత్రి పార్ధసారధి తెలిపారు. 2024 తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేసిందని మంత్రి పార్ధసారధి చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి కేంద్రానికి పంపించి మంజూరు చేయించుకోవడం జరిగిందని అన్నారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకంలో భాగంగా 57,600 గృహాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకంలో భాగంగా 684 ఇళ్లు, పీఎం-జనమన్ క్రింద 28,430 ఇళ్లు మొత్తం 86,714 ఇళ్లు మంజూరయ్యాయని హర్షం వ్యక్తం చేశారు.ఈప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు పిఎంఏవై అర్బన్,గ్రామీణ మరియు పియం జన్ మన్ పథకాల కింద 2వేల 102 కోట్ల రూ.లు ఖర్చు చేసి 4లక్షల 56వేల 536 ఇళ్ళను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.పక్కా గృహాల నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి ప్రభుత్వం దరఖాస్తులు కోరగా దాదాపు 10,42,199 దరఖాస్తులు అందాయన్నారు.స్క్రూటినీ అనంతరం నిబంధనల మేరకు 9.50 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు.వీటిలో మొదటి విడతగా కేంద్రం 74,812 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.భవిష్యత్తులో అర్హుల సంఖ్యను బట్టి కేంద్రం నుండి పెద్ద సంఖ్యలో ఇళ్లను మంజూరు చేయిస్తామని హామి ఇచ్చారు. పీఎంఏవై అర్బన్ 2.0 పథకానికి యూనిట్ ధర రూ. 2.50 లక్షలుగా నిర్ధారించడం జరిగిందని మంత్రి తెలిపారు.ఇందులో రూ.1.50 లక్షలు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం రూ.1లక్ష అందించనున్నాయన్నారు. అంతేకాకుండా అవసరమైతే ఎస్ హెచ్ జి గ్రూప్ లో సభ్యులైన లబ్ధిదారులు బ్యాంకుల నుండి ఆర్థిక సహాయం పొందవచ్చున్నారు.అలాగే అదనంగా స్వచ్ఛభారత్ మిషన్ నుండి మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించడానికి గృహ నిర్మాణ శాఖ కసరత్తు చేస్తుందన్నారు.అర్బన్ హౌసింగ్ పథకంలో ఇప్పటి వరకు 5801 ఇళ్లు పూర్తి చేయడంతో పాటు రూ.178.95 కోట్లు ఖర్చు చేశామన్నారు.పీఎంఏవై గ్రామీణ పథకంలో భాగంగా యూనిట్ ధర రూ. 2.39 లక్షలుగా నిర్ధారించడం జరిగిందన్నారు.ఇందులో రూ. 72వేలు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం రూ.48వేలు అందిస్తున్నాయన్నారు.అంతేకాకుండా రూ.80 వేలు వడ్డీ లేని రుణాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.అలాగే ఎన్ఆర్ఈజీఎస్ క్రింద రూ.39 వేలు అందిస్తున్నామన్నారు. స్వర్ణ గ్రామం,వార్డుల్లో పనిచేసే 370 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు కేటాయించడంతో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అవుతాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు.సిబ్బంది కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి పార్ధసారథి కృతజ్ఞతలు తెలిపారు.దీంతో పాటు వివిధ కార్పొరేషన్లలో పని చేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 యేళ్ళకు పెంచడంతో గృహ నిర్మాణంలో నైపుణ్యం, విశేష అనుభవం ఉన్న దాదాపు 348 మంది వరకు విధుల్లో కొనసాగే అవకాశం ఉందని వారి పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం అవుతాయని చెప్పారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని గృహ నిర్మాణ శాఖ చేపడుతుందని మంమత్రి పార్ధసారధి తెలిపారు.ఇప్పటికే బుట్టాయిగూడెం,తాడువాయి తదితర ప్రాంతాల్లో వేగంగా గృహ నిర్మాణాలు చేస్తున్నామన్నారు.పునరావసంలో భాగంగా పోలవరం పూర్తయ్యే లోపు నిర్వాసితులు అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పార్ధసారధి స్పష్టం చేశారు.

# ఆలయ పనుల నిలిపివేతకు నిరసనగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాదయాత్ర!





**నంది పత్రిక -డోన్** డోన్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుండాల చెన్నకేశవ స్వామి దేవాలయ పునః నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించారు. కోట్రాయి గ్రామం నుండి గుండాల ఆలయం వరకు ఈ పాదయాత్ర సాగింది. దేవాలయ పనులను అడ్డుకుంటున్న కూటమి నేతలకు దేవుడే మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు.

**రూ. 50 కోట్లతో ఆలయాల పునరుద్ధరణ..** ఈ సందర్భంగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని ఆలయాల పునరుద్ధరణ, అభివృద్ధి కోసం దాదాపు 50 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. అందులో భాగంగానే చారిత్రాత్మక గుండాల దేవాలయ పనుల కోసం రూ. 10 కోట్లు కేటాయించి పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు.

**కమీషన్ల కోసమే బెదిరింపులు:** అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ నేతలు కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను తీవ్రంగా బెదిరిస్తున్నారని బుగ్గన ఆరోపించారు. వారి వేధింపులు, బెదిరింపుల వల్లే ప్రస్తుతం గుండాల దేవాలయ నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆయన మండిపడ్డారు. పవిత్రమైన దైవకార్యాల్లో కూడా రాజకీయాలు చేస్తూ, కమీషన్ల కోసం కక్కుర్తి పడటం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

**భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు:** ఆలయ అభివృద్ధి పనులను వెంటనే పునఃప్రారంభించాలనే డిమాండ్‌తో సాగిన ఈ పాదయాత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు
పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర రెడ్డి ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి
వైస్ ఎంపీపీ ఎర్రి స్వామిమండల అధ్యక్షుడు సోమేశ్ యాదవ్
మాజీ సింగిల్ విండో చైర్మన్ తిరుమల్ రెడ్డిమార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు మలియాల భాస్కర్ రెడ్డి, మలియాల శ్రీనులతో పాటు పార్టీ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు.



# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధం

### జి వెంకటరామిరెడ్డి,మున్సిపల్ కమిషనర్.

**నందికొట్కూరు జులై 7(నంది పత్రిక )** మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార నిర్వహణలో ఉపయోగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తిగా నిషేధిస్తున్నట్లు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి పట్టణ ప్రజలకు మరియు వ్యాపారస్తులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం నందు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నిషేధంపై పట్టణ వ్యాపారస్తులతో కమిషనర్ జి వెంకట రామిరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్లాస్టిక్ వినియోగం వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై కమిషనర్ వ్యాపారస్తులకు ఆహ్వానం కల్పించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. దీనిపై మార్కెట్ అసోసియేషన్ సభ్యులు సానుకూలంగా స్పందించి ప్లాస్టిక్ నిషేధానికి పూర్తిగా సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ వ్యాపారస్తులు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# 'సార్' కాల వ్యవధిని పెంచాలి.

## మన ఓటు మన హక్కు... ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం

**గణేష్ నగర్‌లో సార్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించిన వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కల్లూరు అర్బన్ పరిధిలోని 19వ వార్డు గణేష్ నగర్‌లో జరుగుతున్న సార్ వెరిఫికేషన్ ప్రక్రియను వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి , కర్నూలు నగర మాజీ మేయర్ బి.వై. రామయ్య తో కలిసి పరిశీలించారు.వార్డు నాయకులు నల్లబోలు గోపాల్ రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 49, 50 పోలింగ్ బూత్‌లను సందర్శించి, వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రతి ఓటు ఎంతో విలువైనది. ప్రతి ఓటరు తమ ఓటు వివరాలను తప్పనిసరిగా మీ బి ఎల్ ఓ ద్వారా పరిశీలించుకుని, అవసరమైన వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. ఓటు హక్కును కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ 19వ వార్డు నాయకులు,పార్టీ నాయకులు వైఎస్ఆర్సిపి మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



**అధికార పత్రం బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుర్తింపు కార్డులు ఉండాలా.**
**ఉపా చట్టాన్ని రద్దు చేయాలి**
**దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ**
**రైతులను ఆదుకోవాలి**
**అయోధ్య సోత్తు ఎవరి పాలు**
**ఆగస్టు నుంచి 6 నుంచి 15 వరకు ప్రచార పోరాట కార్యక్రమాలు**
**సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ**
**విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**




**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రక్రియ ఇప్పటి వరకు 45 శాతం కూడా జరగలేదని గణాంకాలు చెబుతుండగా ఎన్నికల కమీషనర్, జిల్లా కలెక్టర్లు ఓటర్ల హక్కులను కోల్పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్పించాలంటే ప్రస్తుత సమయం సరిపోదని, ఓటర్ల జాబితా ప్రక్రియకు సంబంధించి మరో మూడు మాసాలు గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధికారులను డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియను నిర్వహించే అధికారులకు, ప్రజలకు ఓటర్ల ప్రక్రియపైన పూర్తి అవగాహన లేకపోవంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారని దీని వలన గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంగళవారం హోచిమిన్ భవన్లో జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న అనేక రాజకీయ అంశాలపైన ప్రజా హక్కులపైన రైతుల ఆందోళనలపైన అయోధ్య రామమందిరంలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపైన సమగ్రంగా వివరిస్తూ దేశ ప్రజల సమస్యలపైన అలుపెరుగని పోరాటంతో దశలవారీగా ముందుకు వెళతామన్నారు. ఓటర్ల జాబితా కోసం నియమించిన అధికారులకు సాంకేతిక పరమైన అవగాహన లోపాలు ఉన్నాయని గుర్తింపు కార్డుల పరిశీలన 2002 ముందు కంటే ఓటర్ల జాబితా పైన సరైన అవగాహన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పాసుపోర్టులు కూడా ప్రయాణానికి ఉపయోగించే ధృవీకరించే పత్రంలాగా గుర్తిస్తున్నాయని అంతేకాకుండా ఆధార్కార్డు, రేషన్కార్డు, పాన్కార్డు ఇలాంటి అనేక కార్డులకు కూడా విలువ లేకుండా కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలనను సాగిస్తుందని ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పాలనకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్మోహన్రెడ్డిలు తొత్తులుగా వ్యవహరిస్తూ తానా అంటే తందానా అని వంత పాడుతున్నారని విమర్శించారు. భారతదేశ పౌరుడిగా ఉండాలంటే బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్ గుర్తింపు కార్డులు ఉంటే సరిపోతాయా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఆరుకోట్లకు పైగా ఓటర్లను తొలగించారని ప్రస్తుతం ప్రక్రియ పూర్తయ్యేలోపల 20 కోట్ల మందిని తొలగించాలనే ధ్యేయంతో ముందుకెళుతున్నారని దీనిని సీపీఐ పార్టీగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపా చట్టం కింద రావణ్ను అరెస్టు చేసి అరాచకానికి రాష్ట్ర ప్రభుత్వం ఒడిగడుతోందని అధికారం చేతిలో ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు చేస్తే ప్రజలు తిరగబడతారని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రం, దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పాలన కొనసాగుతోందని ఇది ఇలాగే కొనసాగితే దేశ భవిష్యత్ తీవ్ర ఆందోళనలో ఉంటుందన్నారు. రాష్ట్రంలో అన్ని పంటలకు సంబంధించిన రైతులు ఆందోళనబాటలు పట్టారని వారికి సరైన తాగు, సాగునీరు అందించి ప్రాజెక్టులు పూర్తి చేసి తగిన న్యాయం చేయాలన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని మైనింగ్ వ్యవస్థ అవినీతిమయంగా మారిందని మంగంపేటలోని బైరైటిస్ ను 80వేల కోట్ల విలువ చేసే ఖనిజాన్ని జగన్ తరలించాడని విమర్శించిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు అదే సంస్థకు చంద్రబాబు కట్టబెట్టడం ఎంతమాత్రం సబబని ప్రశ్నించారు. రాష్ట్ర సమస్యలు, రైతుల ఆందోళనలపైన ప్రజల గొంతుక చేసుకొని ఆగస్టు 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కలుపుకొని గ్రామస్థాయి వరకు ప్రచార పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ధరల నియంత్రణ, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. అయోధ్య రామాలయంలో జరిగిన అవకతవకలపైన మోదీ వారి అనుచర వర్గం ఏమి చెబుతారని ఆయన వారిని సూటిగా ప్రశ్నించారు. సీపీఐ పార్టీ అయోధ్య రామాలయానికి వ్యతిరేకం కాదని అయోధ్య రామాలయంలో 200 కోట్లు పైగా డబ్బులు అన్యాక్రాంతమయ్యాయని 40 రోజుల్లో 70సార్లు అవహరణ జరిగిందని దీనిని ఏ విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ పరిష్కరిస్తారని ఆయన ప్రశ్నించారు. 1992 సంవత్సరంలో జరిగిన రామమందిర శిలాన్యాప్ కార్యక్రమానికి అప్పట్లో భక్తులు 1400 కోట్లు కానుకలుగా ఇచ్చారని ఆ డబ్బులు ఇప్పుడు కంపారిజన్ చేస్తే 1.68 వేల కోట్లు మొత్తం అవుతుందని వాటికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఏం సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు. మావిగన్కు మా పార్టీ వ్యతిరేకం, అమరావతికి మద్దతు ఉంటుంది కానీ అభివృద్ధి వికేంద్రీకరణ మొత్తం రాష్ట్రమంతా జరగాలి తప్ప ఒక్క అమరావతిలోనే అంటే కాదన్నారు. లక్షల కోట్లు అప్పు చేసి మొత్తం అమరావతి అభివృద్ధి అంటే వ్యతిరేకత వస్తుందని పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగాల్సిన అవసరం ఉంటుందన్నారు. చివరగా ఈ సమస్యలన్నింటినీ క్రోడీకరించుకొని సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు గుంటి వేణుగోపాల్, రామయ్య, జి. వలరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం బీజేపీ జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి , కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ సందిరెడ్డి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే,మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు పరిగెల మురళీకృష్ణ పాల్గొని నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ బలోపేతం, సంస్థాగత అభివృద్ధి, రాబోయే కార్యక్రమాల కార్యాచరణ, అలాగే జిల్లాలో పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై మరియు కోడుమూరు నియోజకవర్గం పరిధిలోని గూడూరు నగర పంచాయతీ ఎన్నికల గురించి విస్తృతంగా చర్చించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, పదాధికారులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## 104 వ రోజుకు చేరుకున్న శ్రీశైలం ముప్పు బాధితుల నిరాహార దీక్షలు.



**నందికొట్కూరు జులై 7(నంది పత్రిక )** శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాహణలో సర్వస్కోల్పోయిన ముంపు బాధితులకు జీవో 98 ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్న ప్రభుత్వ హామీని అమలు చేయాలని కోరుతూ ముంపు బాధితులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 104 రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి ముంపు బాధితులు జయన్న మాట్లాడుతూ రాష్ట్రంపై ఎలాంటి ఆర్థిక భారం పడిన పదవి విరమణ పొందిన లస్కర్ లా 205 పదవిల ఖాళీ స్థానములను అర్హులైన ముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ చేపడుతున్న దీక్షలకు ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉపాధి కల్పించమని అడుగుతుంటే కనీసం ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీవన భృతి లేక 32 మంది ముప్పు బాధితులు ఆత్మహత్యలు చేసుకున్న ప్రభుత్వం శ్రీశైలం ముంపు బాధితులకు 98 జీవో అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఆలోచన చేయకపోవడం దురదృష్టకరం, చాలా దుర్మార్గమని న్యాయం జరిగేంత వరకు పోరాటం తప్పదని ఆయన పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో నాగేంద్ర, సుబ్బయ్య, రాజారావు, మురళి, నాగరాజు, రామకృష్ణ, శ్రీనివాసులు, రంగయ్య, జయన్న పాల్గొన్నారు.

## రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం: కూర్మనాథ్

**సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ కూర్మనాథ్**



**పాణ్యం, జూలై 07(నంది పత్రిక):-** ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేలో రైతులను భాగ స్వాములను చేసి వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టరు కోణంకి కూర్మనాథ్ ఆదేశించారు. మంగళవారం నంద్యాల జిల్లా పాణ్యం మండలం పాణ్యం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాణ్యం గ్గ్రామానికి సంబందించి వీఆర్వో, సర్వేయర్ల లాగిన్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సర్వే రోజున తప్పనిసరిగా సంబంధిత రైతులు ఉండాలన్నారు. పూర్తయ్యాక డాక్యుమెంటు వెరిఫికేషన్ ద్వారా హద్దుల నిర్ణయం వారి సమక్షంలో జరగాలన్నారు. ఇందులో పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి చేతికి సరైన కొలతలతో పాసుపుస్తకం ఇవ్వాలన్నారు. గతంలో నిర్వహించిన దానిలో అనేక లోపాలు ఉండడంతో 2.0 రీ సర్వే చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2800 బృందాలతో సర్వే చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ ఇన్స్పెక్టర్ అఫ్ సర్వయర్ విజయ కుమారి మండల తహసీల్దార్, సర్వే, రెవిన్యూ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం.



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మంగళవారం07/07/2026 తేదీన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి , కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ సందిరెడ్డి శ్రీనివాసులు హాజరయ్యారు.ఈ సమావేశానికి బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం, సంస్థాగత అభివృద్ధి, రాబోయే కార్యక్రమాల కార్యాచరణ, అలాగే జిల్లాలో పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ రాష్ట్ర,జిల్లా నాయకులు, వివిధ మోర్చానాయకులు ,పదాధికారులు,వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై పార్వతి బాయ్ వేసిన కేసు గురించి స్పందించిన శ్రీశైలం బోర్డు మెంబర్ జే రేఖా గౌడ్




**కర్నూల్ సిటీ నంది పత్రిక** సుగాలి ప్రీతి విషయంలో తమకు పవన్ కళ్యాణ్ న్యాయం చేస్తారని అని చెప్పి ప్రీతి తల్లి పార్వతి దేవి పవన్ కళ్యాణ్ ద్వారా లబ్ది పొంది ఇప్పుడు ఆయన పైనే కేసు పెట్టడం ఎంత వారు సమంజసమని జనసేన పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జి,శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు రేఖగౌడ్ విమర్శించారు. సుగాలి ప్రీతి కేసులో ప్రీతి తల్లికి ఈ రాజకీయ పార్టీ అండగా లేని సమయంలో పవన్ కళ్యాణ్ అండగా నిలిచి పోరాటం చేశారని పవన్ కళ్యాణ్ పోరాటం కారణంగా ప్రీతి కుటుంబానికి పరిహారం లభించిందని పవన్ కళ్యాణ్ ద్వారా లబ్ధి పొంది ఇప్పుడు పవన్ కళ్యాణ్ ను ప్రతి విషయంలో తమకు పవన్ కళ్యాణ్ అన్యాయం చేశాడని చెప్పడం మంచి పద్ధతి కాదని ఒకరి లబ్దికోసం పవన్ కళ్యాణ్ విమర్శించడం సరికాదని పార్వతి దేవి పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేసే ముందు ఆలోచన చేయాలని లేని పక్షాన ప్రీతి కేసును మరోసారి సమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతామని రేఖ గౌడ్ స్పష్టం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కరుణాకర్ రామ్మోహన్ సుధాకర్ జీవన్ మహబూబ్ మాలిక్ వీర మహిళలు సుజాత పుష్ప మొదలగు వాళ్లందరూ పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మగౌరవ పోరాటానికి 32 ఏళ్లు

**ఎమ్మార్పీఎస్ అవిర్భావ దినోత్సవం వేడుకలు నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు**

**జూపాడుబంగ్లా: జూలై: 8: (నంది పత్రిక)** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ మరియు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన పురస్కరించుకొని జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఎస్. విజ్జి మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ ఎస్ విజ్జి మాదిగ మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరపోరాటానికి 32 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జూపాడుబంగ్లా మండలం కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనముగా నిర్వహించడం జరిగింది. మాదిగల ఆత్మగౌరవం చిహ్నాము మాదిగల మానస పుత్రుడు పద్మశ్రీ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ జన్మ దినము మాదిగల ఆత్మగౌరవ పండుగ ఘనంగా నిర్వహించడం జరిగింది. మాదిగల ఆత్మగౌరవం చేసే చేసే ప్రయత్నంలో ప్రతి ఒక్కరు మనోధైర్యాన్ని పెంచే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్త నాయకునికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎం. హనోక్ మాదిగ, సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకుడు అడ్డాకుల ప్రసాదు, రెడ్డి పోగు సుబ్బన్న, అడ్డాకుల కృష్ణ, అభిషేక్ శ్యాంబాబు దాదెపోగు రాజేష్, దావీదు తదితరులు కార్యకర్తలు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

## మహిళల భద్రత కు" శక్తి యాప్" ఎంతో దోహదపడుతుంది : అర్బన్ సీఐ అశోక్ కుమార్.



**నందికొట్కూరు జులై 7(నంది పత్రిక )** మహిళల భద్రత రక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శక్తి యాప్ వినియోగంపై మహిళలు అమ్మాయిలు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, తమ మొబైల్ నందు శక్తి యాప్ కలిగి ఉండడం తమ భద్రతకే ఎంతో దోహదపడుతుందని అర్బన్ సీఐ అశోక్ కుమార్ విద్యార్థినిలకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్బన్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మహిళల భద్రత చట్టాలు, శక్తి యాప్ వినియోగం, ఫోక్స చట్టం, 1098,181,1930 డయల్ నెంబర్స్ ప్రాధాన్యతపై తద్వారా పోలీస్ సేవలపై నంది కళాశాల ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహిళల భద్రతకు రక్షణకు శక్తి యాప్ తమ మొబైల్ నందు కలిగి ఉండడం ఎంతో ప్రయోజనకరమని ప్రతి ఒక్క మహిళ దీన్ని కలిగి ఉండాలని ఆయన అమ్మాయిలకు సూచించారు. అంతేకాకుండా బాల్య వివాహాలు చట్టవిరుద్ధామని, వాటిని ప్రోత్సహించరాదన్నారు. అదేవిధంగా మొబైల్ నందు అనవసరమైన లింకులు ఓపెన్ చేయడం ద్వారా ఎంతోమంది తమ నగదును అకౌంట్లో కోల్పోతూ మోసపోతున్నారని అలా ఏవైనా సమస్యలు జరిగినప్పుడు 1930 డయల్ నెంబర్ కు ఫోన్ చేసి న్యాయం పొందవచ్చునని తెలిపారు. అదేవిధంగా నేటి యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళల చట్టాలు సైబర్ మోసాలపై ప్రతి విద్యార్థిని తమ కుటుంబంలో కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మన్సూర్ అహ్మద్ , శక్తి టీమ్స్ సిబ్బంది రసూల్ మరియు కళాశాల సిబ్బంది పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోకవరం సబ్ స్టేషన్ నందు నూతన అదనపు బ్రేకర్ ప్రారంభం

### - విద్యుత్ శాఖ ఎ డి



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని గోకవరం సబ్ స్టేషన్ నందు కొక్కెరంచ అగ్రికల్చర్ 11 కె వి నూతన అదనపు(ఫిడర్ )బ్రేకర్ ను విద్యుత్ శాఖ ఎ డి రామసుబ్రమణ్యం ప్రారంభించారు ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికీ పైరుకు తగ్గ వర్షాలు కరవకపోవడంతో కొద్దో గొప్పో బోరు బావులలో నీటి వసతి వున్న రైతులు విద్యుత్ మోటార్ల ద్వారా పంటపొలాలకు నీళ్లు పెట్టుకునేందుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా రైతులకు నిరంతరాయంగా 9 తొమ్మిది గంటల కరెంట్ ఇచ్చేందుకే ఈ నూతన అదనపు బ్రేకర్ ను ప్రారంభించడం జరిగింది అన్నారు ప్రస్తుత వాతావరణ దృష్ట్యా ఈదురు గాలులు అధికంగా ఉండడం వలన విద్యుత్ సరఫరాలో చిన్నపాటి అంతరాయం ఏర్పడిన రైతులు ప్రజలు విద్యుత్ శాఖ వారికీ సహకరించాలన్నారు ఈ బ్రేకర్ ప్రారంభ కార్యక్రమంలో ఎ ఇ అభిద్ లైన్ ఇన్ స్పెక్టర్ సుందరయ్య లైన్ మ్యాన్లు నాగిరెడ్డి కిష్టన్నా మరియు సిబ్బంది పాల్గొన్నారు

## విచారణ పేరుతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఆస్పరి సీఐ శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలి సిపిఐ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** విచారణ పేరుతో ప్రజలను చితకబాదుతున్న ఆస్పరి సీఐ శ్రీనివాస్ నాయక్ పై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, నక్కి లెనిన్ బాబు పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాదితులను సీఐ శ్రీనివాస్ నాయక్ విచారణ పేరుతో దూషించడమే కాకుండా చితకబాదుతూ సామాన్య ప్రజలు పోలీస్ స్టేషన్ కు రావాలంటేనే భయపడే విధంగా ప్రవర్తిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి అనే వ్యక్తిని కేసు విచారణ పేరుతా అనేక సార్లు పోలీస్ స్టేషన్ కు పిలిపించి చితక బాధడంతో ఎవరికి చెప్పుకోలేక తీవ్ర మానసిక ఆవేదన గురయ్యాడని మంగళవారం మరొక సారి హనుమంతు రెడ్డి కి సీఐ పిలుస్తున్నారు స్టేషన్ కు రావాలని పోలీసుల ద్వారా సమాచారం రావడంతో సిఐ కొడతాడని భయపడిన హనుమంత్ రెడ్డి స్టేషన్ లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడని దీనికి సీఐ ప్రవర్తనే కారణమని వారు పేర్కొన్నారు పోలీస్ వ్యవస్థ, పోలీసులు ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలి తప్ప ఇలాచితకబాదుతో ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న శ్రీనివాస్ నాయక్ లాంటి వారితో పోలీస్ వ్యవస్థకే చెడ్డ పేరు వస్తుందని కావున ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే శ్రీనివాస్ నాయక్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని హనుమంతు రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు

## రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేషియా బంధం

రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు.

# వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక





### డోన్ మార్కెట్ యార్డ్‌లో ఘనంగా ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ

### రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే కోట్ల

**నందిపత్రిక -డోన్** వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డోన్ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.

**సాగు ఖర్చులు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం:** ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సాగు ఖర్చులను తగ్గించి, వారు అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు సకాలంలో అందించడం ద్వారానే మెరుగైన పంట దిగుబడులు సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి రైతు సాంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు, సలహాలను పాటించాలని సూచించారు.రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి: రైతుల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు త్వరితగతిన చేపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ లబ్ధిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసీ ఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక, వలసల రామకృష్ణ, పణి రాజ్, ఏ డి ఏ సునీత, ఏవో శ్రీనివాసరెడ్డి, హరికిషన్, సామాన్య రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎపి. రైతు సంఘం నాయకులు ఇచ్చిన వినతి పై స్పందించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి.





### గూటుపల్లె చెరువును సర్వే చేయించి, హంద్రీనీవా ద్వారా నీటిని తరలించే ప్రయత్నం చేస్తాం అన్న ఎమ్మెల్యే

**బేతంచెర్ల జులై 7 ( నంది పత్రిక )** డోన్ నియోజకవర్గం బేతంచెర్ల మండలం గూటుపల్లె గ్రామంలో నిర్వహించిన వక్ఫ్ బోర్డ్ భూముల పరిష్కార వేదిక కార్యక్రమము మంగళవారం జరిగింది. డోన్ ఎంఎల్ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి పి. రామ్మోహన్,రైతులతో కలిసి,డోన్ ఎంఎల్ఎల్ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డికి,గూటు పల్లె చెరువును రిజర్వాయర్ గా చేయాలి అని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి.రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ,బేతంచెర్ల మండలం పూర్తిగా మెట్ట ప్రాంతము, కొండ ప్రాంతము. ఎటువంటి సాగునీరు లేని మండలం బేతంచెర్ల మండలం అన్నారు.మండలంలోని రైతులందరూ కూడా,పూర్తిగా వర్షం పై ఆధారపడి పంటలు సాగు చేయుచున్నారని, బోరు బావుల మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారని, వర్షాలు కురవకపోతే పైర్లు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. పంటలపై పెట్టుబడులు రాక,దిక్కు తోచని స్థితిలో రైతులు నష్టాలపాలై, పంటలు సాగు చేసిన అప్పులు తీర్చలేక, ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో బేతంచెర్ల మండలము చుట్టూ ఉన్న మండలాలకు సాగునీరు అందుతుందని, బేతంచెర్ల మండలంలో "ఏ ఒక్క ఎకరాకు "కూడా సాగునీరు అందడం లేదని అన్నారు ,మండలంలో గూటుపల్లె చెరువు సుమారు 200 ఎకరాలలో విస్తరించి ఉందని,రాజుల కాలంలో నిర్మించిన ఈ చెరువుకు ఎక్కువ వర్షాలు పడి చెరువులోకి నీరు వస్తే, రైతులు పొలాల్లో వేసుకున్న బోరు బావులకు నీరు లభిస్తుందని,వర్షాలు పడకపోతే బోరుబావులు ఎండి పోతున్నాయని గూటుపల్లె చెరువును రిజర్వాయర్ గా మార్చి,హంద్రీ-నీవా సుజల స్రవంతి నీటి కాలువ ద్వారా,గూటుపల్లె చెరువును నీటితో నింపితే,మండలంలోని 13 గ్రామాల రైతుల బోరు బావులకు నీరు పుష్కలంగా అందుతుందని వివరించి ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు.స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతు సంఘం నాయకులు ఇచ్చిన అర్జీని రైతులకు వివరించి,రాబోయే కాలంలో చెరువును పరిశీలించి,సర్వే చేయించి,మండల ప్రజలందరికీ ఉపయోగపడే చెరువును రిజర్వాయర్ గా మార్చి, హంద్రీ నీవా నీటి కాలువ నుండి ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని, గ్రామసభలో రైతులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతు సంఘం బేతంచెర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు సి.మద్దిలేటి స్వామి,పి.రామ మోహన్,రైతు సంఘం నాయకులు బాల శేఖర్, టిడిపి నాయకులు మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఒక వక్ఫ్ బోర్డ్ రైతుల సమస్యకు పరిష్కారం:

### డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి.

**బేతంచెర్ల జులై 7 (నందిపత్రిక )** బేతంచెర్ల మండలంలో 2008వ సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న వక్ఫ్ భూముల సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుందని, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం మండలం లోని గూటుపల్లె పంచాయతీలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి రైతులతో సమావేశం నిర్వహించారు. గూటుపల్లె, నాగమల్ల కుంట, రహిమాన్ పురం, తవిసి కొండ, హుసేనాపురం గ్రామాలకు చెందిన సుమారు 2000-2500 ఎకరాల భూములు వక్ఫ్ పరిధిలో ఉన్నాయనే విషయంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు,ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈనెల9 వతేదీన బనగానపల్లెకు ముఖ్యమంత్రి వస్తున్న సందర్భంలో మంచి వార్త వస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా రైతులు పంటలు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ, మీ సేవలో అడంగల్, 1బి రికార్డులు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడంతో,రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో క్రాప్ లోన్లు,రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల డబ్బులు అందడం లేదని వివరించారు.ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం త్వరలో పూర్తి చేస్తారని రైతులు ఆనందంగా ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నం యల్ల నాగయ్య, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగ మోహన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## మాజీ ఎంపీటీసీ కుమారుడును పరామర్శించిన మాజీ మంత్రి బుగ్గన

**బేతంచర్ల జులై 7 (నంది పత్రిక )** బేతంచెర్ల పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ లింగమూర్తి కుమారుడు మోహన్ ఆచారి (బాలీశ్వరయ్య మనవడు) అనారోగ్యంతో ఉన్నాడని సమాచారం తెలుసుకున్న, రాష్ట్రఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మోహన్ ఆచారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొని మంగళవారం పరామర్శించారు.ఆ ధైర్య పడద్దని సూచించారు. మాజీ మంత్రి బుగ్గన తోపాటు మండల సీనియర్ వైసీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురలీకృష్ణ,టౌన్ కన్వీనర్ షేక్ పిట్టల జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్ ఇబ్రహీం, గొర్మానుకొండ గ్రామ మాజీ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు సలీం, ఫిరా, బషీర్ అహ్మద్, రాఘవేంద్రరెడ్డి, దాసరి మద్దిలేటి,కందుల భాస్కర్ రెడ్డి,మహేశ్వర రెడ్డి,పురుషోత్తం రెడ్డి,పిక్కిలి మనోహర్ నాయుడు,వలి భాష,తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



# మండల అధికారుల సమక్షంలో ఎరువుల పంపిణీ



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండల అధికారుల సమక్షంలో ఎరువుల పంపిణీ ప్రశాంతంగా జరిగిందని ఏవో అమిరున్నిసా బేగం అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు యాప్ ద్వారా యూరియా, డీఏపీలను పంపిణీ చేశామని అన్నారు ప్రతి రైతు తప్పనిసరిగా ఎపిఎఐఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేసి యాప్ లో సూచించిన విధంగా ప్రతి రైతుకు ఎరువులను పంపిణించడం జరిగింది అన్నారు ఇప్పటి వరకు యూరియా 301 మెట్రిక్ మరియు డిఏపి 221 మెట్రిక్ టన్ను రైతుసేవ కేంద్రం మరియు నాగంపల్లి సొసైటీ కేంద్రం, గ్రోమోర్ ద్వారా అందించడం జరిగింది.సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా ఉంటాయి. కావున రైతులు వర్షాధార పంటలు కి మొగ్గు చూపాలి అన్నారు పత్తి, కంది, పెసర, మినుము, సొయాచిక్కుడు వంటి తక్కువ నీటి అవసరం మరియు తక్కువ కాల పరిమితి గల పంటలు వేసుకోవాలనీ సూచించారు. ఎరువుల పంపిణీలో మండల తహసీల్దార్ ఉమా రాణి, ఎంపీడీఓ మేరీ, సొసైటీచైర్మన్ నాగేశ్వర రావు రైతులు పాల్గున్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కంటే సభలు ప్రచారానికి టిడిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది వైకాపా రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి




**ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 7 నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎల్లుండి బనగానపల్లె పర్యటనను పురస్కరించుకుని, ఆళ్ళగడ్డ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి ప్రభుత్వంపై సూటిగా ప్రశ్నలు సంధించారు. మంగళవారం రోజున ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కంటే సభలు, ప్రచారానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కేవలం సభలు, సమావేశాలతో కాలక్షేపం చేయడం కాకుండా, ముఖ్యమంత్రి నేరుగా పొలాల్లోకి వచ్చి రైతుల వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని భూమా కిషోర్ డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న సాగునీటి ఎద్దడి, యూరియా కొరత, మరియు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న అన్నదాతల సమస్యలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. ముఖ్యంగా మొక్కజొన్న, జొన్నల కొనుగోలులో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టారు. అలాగే అహోబిలం క్షేత్రం మఠానికి సంబంధించినదని, అందులో ప్రభుత్వ జోక్యం అనవసరమని ఆయన వ్యాఖ్యానించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ ఏర్పాటు చేసిన టోల్‌గేట్ వ్యవస్థను వెంటనే తొలగించాలని కోరారు. దేవుడు సొమ్ము తిన్న ఏ ఒక్కరు బాగుపడ్డ చరిత్ర లేదని రేపు మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినవెంటనే ఈ టోల్‌గేట్ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.చిత్తశుద్ధి ఉంటే సీఎం పర్యటనలో రైతుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని, లేనిపక్షంలో ఇవన్నీ కేవలం మభ్యపెట్టే చర్యలేనని భూమా కిషోర్ రెడ్డి తేల్చి చెప్పారు.

## ఈ ఏడాది రాయలసీమకు ఎల్‌నినో దెబ్బ... మంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష

ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీని కారణంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో, ముఖ్యంగా రాయలసీమలో, సాధారణం నుంచి తీవ్రస్థాయిలో వర్షపాతం లోటు నమోదైందని అధికారులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ప్రధాన కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నైరుతి రుతుపవనాల పనితీరు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించారు. ఎల్‌నినో కారణంగా రాయలసీమ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమావేశంలో గుర్తించారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్ర వర్షాభావం ఉండగా.. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణ లోటు నమోదైనట్లు అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో కరవు పీడిత మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు.మరోవైపు, విపత్తుల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని, పోలీస్, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని మంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిషేధిత భూముల జాబితా (22-ఏ) కేసుల విచారణకు రైతులు పూర్తి ఆధారాలతో హాజరు కావాలి.

### జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం బ్యూరో చీఫ్ జులై 7 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా నిషేధిత భూముల జాబితా (22-ఏ)లో నమోదైన భూములకు సంబంధించిన సమస్యలను పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీ టి. రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు.జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం 22-ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన దరఖాస్తులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, అర్జీదారుల సమక్షంలో కేసులను పరిశీలించారు. ఈరోజు మొత్తం 16 దరఖాస్తులను పరిశీలించగా 08 కేసులను పరిష్కరించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. మిగిలిన 08 కేసుల్లో దరఖాస్తుదారులు పూర్తి స్థాయి పత్రాలు సమర్పించకపోవడంతో వాటిని తదుపరి విచారణ కోసం వచ్చే వారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు, భూ పన్ను రసీదులు, అడంగల్, 1-బి, ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ) ప్రతులు, పూర్వపు రికార్డులు తదితర అవసరమైన ఆధారాలను సమర్పించాలని ఆయన సూచించారు. సరైన రికార్డులు అందించిన పక్షంలో కేసుల విచారణ వేగంగా పూర్తై రైతులకు త్వరితగతిన న్యాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది మరియు అర్జీదారులు పాల్గొన్నారు

## హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టు నాలుగో పట్టణ సిఐ విక్రమసింహ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కల్లూరు ఎస్టేట్ చింతల ముని నగర్ లో నివాసం ఉండే కొండపల్లి శ్రీనివాసులు మే నెల 13వ తారీఖు నుండి కనిపించడం లేదు అని అయితే కనిపించకుండా పోయిన వ్యక్తి ఇంటికి తిరిగి వస్తాడులే అనే నమ్మకంతో జూన్ 20 వరకు వేచి ఉండి అప్పటికి రాకపోయేటప్పటికి జూన్ 20 తారీకున కొండపల్లి శ్రీనివాస్ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసి అందులో దర్యాప్తుల భాగంగా కాల్ డేటా తీసుకొని విచారించగా, కొండపల్లి శ్రీనివాసులు మరియు అదే ప్రాంతంలో నివాసం ఉండే మేస్త్రి పని చేసుకుంటూ జీవించే మౌలాలి ఇద్దరు గతంలో స్నేహితులు అని మౌలాలి కొంత డబ్బుని అప్పుగా కొండపల్లి శ్రీనివాసులకి ఇచ్చి ఒక సంవత్సరం ముందు ఆ డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగినప్పుడు ఆ డబ్బు విషయంగా మాట మాట పెరిగే ఇద్దరికీ కూడా మనస్పర్ధలు వచ్చాయి. ఈ విషయంలో కొండపల్లి శ్రీనివాసులు తన స్నేహితులతో కలుసుకొని గతంలో రెండుసార్లు మౌలాలిని కొట్టినాడు అని ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని దీన్ని ఇలాగే వదిలేస్తే నాకు మళ్ళీ దాడి చేస్తాడేమో అని ఇతన్ని ఏ విధంగా అయినా సరే తుద ముట్టించాలి అని మనసులో బలంగా అనుకొని అందుకు తనతో పాటు సెంట్రింగ్ పని చేసేటటువంటి అదే ప్రాంతానికి చెందిన యువరాజ్ అలియాస్ అభి యొక్క సహాయం కోరి అతని స్నేహంగా మచ్చిక చేసుకుని అతనికి కావలసినటువంటి అవసరం తీరుస్తూ ఎలాగైనా కొండపల్లి శ్రీనివాసులు మళ్లీ తన జోలికి రాకుండా గట్టిగా కొట్టి బుద్ధి చెప్పడం లేదా కుదిరితే చంపేయాలి అనేటువంటి ఉద్దేశంతో సదరు అభి యొక్క సహాయని కోరగా ఇద్దరు కూడా మే నెల 13వ తారీఖున సదరు కొండపల్లి శ్రీనివాసులకు ఫోన్ చేసి అతన్ని సంతోషనగర్ నుంచి పికప్ చేసుకొని చిన్నమ్మ సర్కిల్లో రాత్రి సుమారు 10 గంటల సమయంలో మద్యం కొనుగోలు చేసి అటు నుంచి కల్లూరు ఎస్టేట్ లోని శ్రీ గోద ఆంజనేయస్వామి దేవాలయం శివరారు ప్రాంతాలలో ఉన్నటువంటి వెంచర్ వద్ద, పొలాల్లో మద్యం సేవించి అక్కడ మాట పెరిగి ముందుగా వాళ్ళు అనుకున్న పథకం ప్రకారం అతన్ని ఇద్దరూ కలిసి తీవ్రంగా కొట్టి ఒక బండ రాయితో తల మీద మోది చంపి ఇద్దరు అక్కడి నుంచి పారిపోయినట్టుగా తెలిసింది. అయితే హత్య గా ధ్రువీకరించుకొని వారి ఇద్దరినీ నిన్నటి రోజున అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించడమైనది. పోలీస్ విచారణలో భాగంగా ఫిర్యాదు ఆలస్యంగా ఇచ్చినందున శివారు ప్రాంతంలో ఎస్పి ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరా మరియు స్థానిక యువకులతో క్షుణ్ణమైన సర్చింగ్ ఆపరేషన్ నిర్వహించినా ఫలితం కనబడలేదు. అయితే నేరస్థలానికి దగ్గరలో ఒక పుర్రె దొరకడం దాన్ని దీనిని డిఎన్ఏ తో సరిపోల్చడానికి స్వాధీనపరుచుకొని నిపుణుల నివేదిక కోరడమైనది.

## కేంద్ర అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణకు సీఎం చంద్రబాబు అభినందనలు



ప్రముఖ రంగస్థల నటుడు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ప్రతిష్ఠాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఇటీవల గోపాలకృష్ణ ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గుమ్మడి గోపాలకృష్ణకు చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంగస్థల నటనకు తొలిసారిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం లభించడం చాలా సంతోషకరమని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. “గోపాలకృష్ణ ప్రదర్శించే నాటకాలు అన్నీ అద్భుతంగా ఉంటాయి. తన నటనతో తెలుగు నాటక రంగానికి జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపు తీసుకువచ్చారు“ అని చంద్రబాబు కొనియాడారు. గోపాలకృష్ణను శాలువాతో సత్కరించి, ఆయన భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఘనత సాధించడం ద్వారా తెలుగు కళారంగానికి గర్వకారణంగా నిలిచారని సీఎం ప్రశంసించారు.

## కాటసాని విందుకు తరలి వచ్చిన వైయస్సార్ పార్టీ నాయకులు



**బనగానపల్లె జులై 7నందిపత్రిక** వైయస్సార్ పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి అమ్మవారి మొక్కుబడి సందర్భంగా మంగళవారం బనగానపల్లె కొండపేట లోని జి ఎస్ ఎస్ ఫంక్షనల్ భవనంలో విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అశేషంగా హాజరై విందును స్వీకరించారు. దింతో కొండపేట ప్రాంతం రద్దీ వాహనాలతో సందడి నెలకొంది. ముందుగా స్థానిక మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి విందుకు హాజరుకాగా వైయస్సార్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు పాణ్యం మాజీ శాసన సభ్యులు కాటసాని రామ్ భూపాల్ రెడ్డి,చల్లా సూర్య ప్రకాష్ రెడ్డి చల్లా విగ్నేశ్వర రెడ్డి, భూమా కిషోర్ రెడ్డి, గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, గుండం శేషిరెడ్డి,కాటసాని ప్రసాద రెడ్డి తోపాటు యువ నాయకులు కాటసాని నరసింహ రెడ్డి, కాటసాని ఓబుళరెడ్డి,నియజకవర్గంలోని మండల స్థాయి నాయకులు తదితరులు హాజరై విందు అతిధ్యాన్ని స్వీకరించారు.



## మహా శిల్పి బాల వీరాచారి కళా రంగానికి చేసిన సేవ అజరామం

### మహాశిల్పి బాలవీరాచారి జీవిత చరిత్ర టైటిల్ సాంగ్ ఆవిష్కరణ




**ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 7, నంది పత్రిక** శిల్పకళా రంగంలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్న మహా శిల్పి బాల వీరాచారి జీవిత చరిత్రకు సంబంధించిన ‘టైటిల్ సాంగ్‘ ఆవిష్కరణోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక శారద శిల్పకళా మందిరంలో దురుగడ్డ రవీంద్రచారి ఆధ్వర్యంలో బాల విరాచారి షార్ట్ ఫిల్మ్ లోని గీతాన్ని విడుదల చేశారు. మహా శిల్పి బాల వీరాచారి కళారంగానికి చేసిన విశేష కృషిని, ఆయన జీవన ప్రస్థానాన్ని నేటి తరానికి తెలియజేసే అద్భుతమైన ఉద్దేశంతో ఈ టైటిల్ సాంగ్‌ను రూపొందించారు. పాట ఆవిష్కరణ అనంతరం ఆయన శిల్పకళకు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమానికి బాలవీరాచారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శిల్పకళాభిమానులు, ప్రముఖులు, యాక్టర్ రామమనోహర్ నాయుడు,ఆర్టిస్ట్స్ నీరజ హేమ, లిరిక్ రైటర్ అండ్ కో డైరెక్టర్ భైరం లక్ష్మిశేఖర్, డిపిఒ రాము తదితరులు పాల్గొన్నారు.



## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా -- వినతిపత్రం సమర్పించిన రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్.

**బేతంచెర్ల జులై 7 ( నంది పత్రిక ).** ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా, బేతంచెర్ల పట్టణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పెంచిన పెట్రోల్, డీజల్,వంట గ్యాస్, నిత్యవసర వస్తువులు తగ్గించాలని, కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, కేంద్రం తీసుకొచ్చిన కార్మిక చట్టాలు నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం బేతంచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ ఎమ్మార్వో కుసమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు వై.ఎల్లయ్య, బి.రామాంజనేయులు,ఎస్ ఖాజా బాషా, ఎ.మద్దిలేటిస్వామి,జె. శ్రీనివాసులు ఆర్.మద్దయ్య.అధిక సంఖ్యలో రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ పాల్గొనడం జరిగింది.



# తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ - యూజింగ్ టెక్నాలజీ' దిశగా తెలంగాణ పోలీస్







ఖమ్మం జిల్లా పర్యటన లో భాగంగా మంగళవారం జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణపై ఎస్పి కాన్ఫిరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణలో పకడ్బందీ చర్యలు, బేసిక్ పోలిసింగ్ పై దృష్టి, కీలక సంస్కరణలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్బంగా డీజీపీ మాట్లాడుతూ...పోలీస్ యూనిఫామ్ ధరించటం అదృష్టంగా భావించి..ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పని చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోట్ల మంది జనాభాలో కేవలం 0.16 శాతం మందికే ఈ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి ప్రజల సేవకు అంకితం కావాలన్నారు.బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలని, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలన్నారు చట్టం అనేది సామాన్యులకు రక్షణ కవచంలా అండగా ఉండాలని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అదేవిదంగా సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని,లిస్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. CCTNS 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇకపై ఎఫెక్టివ్ పోలీసింగ్, స్మార్ట్ పోలీసింగ్ సమాజ శ్రేయస్సు, ప్రజలకు భరోసా ఇచ్చే దిశగా తెలంగాణ పోలీస్ ముందుకు సాగుతోందని, ఇందుకు గాను ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సీసీ కెమెరాలు, డేటా అనలిటిక్స్, సాక్ వ్యవస్థలతో, నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రదానంగా తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టుల కంటే గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటికే ఈగల్ పోలీసు బృందాలు గంజాయి సరఫరా, రవాణా మూలాలను కట్టడికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. “మాదక ద్రవ్యాలపై యుద్ధం చేయాలి.. భావితరాలను కాపాడాలి” అని స్పష్టం చేశారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు.అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ఛాలెంజ్ గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారిందని, నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారని, ఇది పోలీసులకు సవాలుగా మారిందన్నారు. ఇందులో విద్యావంతులు ఎక్కువ నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు యంత్రాంగం, ప్రత్యేక విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరి అని డీజీపీ స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.”అరైవ్ అలైవ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గయని అన్నారు. రోడ్డు భద్రత కోసం ఈగల్ తరహాలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల ధోరణులను, వాటిలో ఉన్న లోపాలను డీజీపీ సమగ్రంగా విశ్లేషించి, దర్యాప్తు నాణ్యత, సత్వర విచారణ, సాంకేతిక వినియోగం, ప్రజల భాగస్వామ్యం పెంపుదల ద్వారా మరింత సమర్థవ ంతమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 2026లో 1,700 కిలోల గంజాయి, 2025లో సుమారు 4,000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వివరించారు. సమావేశంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయబాబు,ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సత్యనారాయణ, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.



# మంత్రి వివేక్ వెంకటస్వామిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి



చెన్నూరు పట్టణం, మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర కార్మిక, ఉపాధి,గనుల శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెన్నూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చెన్నూరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు,చెన్నూరు పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం,బస్సు డిపో, అంబేద్కర్ చౌక్ నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు విస్తరణ,అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం, అమృత్ పథకం కింద మూడు తాగునీటి ట్యాంకుల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ అభివృద్ధిని జీర్ణించుకోలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.మైనారిటీ హాస్టల్‌కు వెళ్లి భోజనం చేసిన అనంతరం రాత్రివేళ విద్యార్థుల ప్లేట్లలో కారపు పొడి వేసి, ప్రతిరోజూ ఇలాంటి భోజనం అందిస్తున్నారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఎవరైనా భావిస్తే సంబంధిత అధికారులకు లేదా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అయితే మంత్రి, ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో అక్రమాలకు,ఇసుక దందాకు పాల్పడిన మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్‌ను మంత్రి వివేక్ వెంకట స్వామి పార్టీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేస్తూ,వ్యక్తిగత కక్షతో మంత్రిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు.విద్యార్థులకు సంబంధం లేని వ్యక్తులు రాత్రి వేళ హాస్టల్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశిస్తే వారిపై వెంటనే పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తరహా రౌడీ రాజకీయాలను బీఆర్ఎస్ నాయకులు అనుసరిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి బెదిరింపు రాజకీయాలకు స్థానం లేదని విమర్శించారు. మంత్రి వివేక్ వెంకట స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి పరుష పదజాలంతో దూషించిన వ్యక్తులపై వెంటనే పోలీసు కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అసత్య ప్రచారాలు,వ్యక్తిగత దూషణలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ తగిన విధంగా స్పందిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దింటి శ్రీనివాస్, బెల్లంకొండ కరుణాసాగర్, అంకా గౌడ్,లింగంపల్లి మహేష్,పాతల నాగరాజ్,చెన్నూరు రాజేష్,చెన్న వెంకటేష్, తనుగుల సతీష్, సలీం, సాహిర్,ఖలీల్,కరీం, ఇబ్రహీం,తనుగుల రవి, సుంకరి సంతోష్, బ్రహ్మయ్య,మున్సిపల్ కౌన్సిలర్లు అజ్జు, పెండ్యాల సాగర్, కో–ఆప్షన్ సభ్యులు సాధన, బోయిన కృష్ణ, సాహిర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారంతోనే విశ్వబ్రాహ్మణులకు మనుగడ



విశ్వబ్రాహ్మణులు ఒక శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారంలో వాటా చేజిక్కించుకోవాలని శాసనమండలి ప్రతిపక్ష నేత,ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పిలుపునిచ్చారు. రాజ్యాధికారంతోనే ఏ కులానికైనా గుర్తింపు,మనుగడ ఉంటాయన్నారు.ఐదు వృత్తులను వేర్వేరు కులాలుగా చూపెట్టి. విశ్వకర్మ జాతి జనాభాను తక్కువ చేసి చూపెట్టడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్లే అధికారాన్ని తారుమారు చేస్తున్న తరుణంలో రాష్ట్ర జనాభాలో 4-5 శాతం ఉండే విశ్వబ్రాహ్మణులు ఎన్నికల్లో కీలకంగా మారతారని వక్తలు పేర్కొన్నారు.మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ తొలి శాసనసభాపతి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు తంగెళ్లపల్లి రవి హాజరై...విశ్వబ్రాహ్మణుల కులం గుర్తింపు,ఐక్యత గురించి మాట్లాడారు.గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ప్రతినిధి చైతన్య కూడా పాల్గొని,తన సామాజిక వర్గం అభ్యున్నతికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా ముఖ్యమైన ఎజెండాగా ఆరు తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించుకున్నారు. ఇందులో ప్రధాన తీర్మానంగా ఐదు వృత్తులైనా ఒక్కటే కులం...అదే విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల కులం అని చాటిచెప్పారు. విశ్వకర్మల వృత్తులను భావితరాలకు చాటిచెప్పేందుకు మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని, వృత్తులను పరిరక్షించాలని, ఆర్థికంగా అండగా నిలవాలని తీర్మానాలు ఆమోది ంచారు. చివరగా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.పాలకులు తమ తప్పులను సరిదద్దుకోని పక్షంలో,పోరాటానికి సన్నద్ధమవ్వాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకు రాజకీయ నాయ కులను, ప్రభుత్వాన్ని కలిసి ఒత్తిడి చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించిన వక్తలంతా ముక్తకంఠంతో నినదించారు.వచ్చేనెలలో మూడో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో జర్నలిస్ట్ మరియు పారిశ్రామిక వేత్త దేవరకొండ కాళిదాస్,విశ్వకర్మ వేదిక వ్యవస్థాపకులు ఆడ్లూరి రవీంద్రా చారి, రచయితల సంఘం నుంచి గాజోజు నాగభూషణం, కుందారం గణేశాచారి, ఉపేంద్రా చారి, దుబ్బాక కిషన్‌రావు,ప్రముఖ ఆంకోలాజిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం, వేదాస్ అధ్యక్షుడు కుమారస్వామి, సదాశ్రీ తదితరులు పాల్గొని విశ్వబ్రాహ్మణులు ఐక్యమత్యం కావాలన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ దొంగల ముఠా అరెస్ట్



పొద్దంతా పాత ఇనుప సమన్లు కొంటామని గ్రామాలలో రెక్కీ నిర్వహిస్తారు. రాత్రి అయ్యింది అంటే చాలు అసలు పనికి దిగుతారు. ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేయడానికి కావలసిన పరికరాలను సామాగ్రిని తరలించేందుకు కావలసిన వాహనాన్ని తీసుకొని బయలు దేరుతారు.చివరికి వారి బండారం బయట పడింది.ఆరుగురు దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడించారు.ఆర్మూర్ ఎసిపి కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో సిపి సాయి చైతన్య మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ను ధ్వంసం చేసి అందులోని రాగి కాయిల్స్ ను దొంగతనం చేస్తున్న ఆరుగురు దొంగల ముఠా ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు .దొంగతనాలకు ప్రోత్సహించి దొంగలించిన కాపర్ కాయిల్స్ ను కొనుగోలు చేసే వారిని అరెస్ట్ చేసినట్టు పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడించారు.ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పాలు ట్రాన్స్ఫార్మర్ల దొంగతనానికి పాల్పడే ఆరుగురు సభ్యులు కలిగిన దొంగల ముఠాను ఆర్మూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ట్రాన్స్ఫార్మర్ దొంగతానికి ఉపయోగించే పని ముట్లతో పాటు,వాటిని తరలించేందుకు ఉపయో గించిన వాహనాలను,ఐదు ,సెల్ ఫోన్లతో పాటు 70 కేజీల కాపర్ ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడించారు. ఆర్మూర్ కేంద్రంగా ఏర్పడ్డ ఈ ముఠా ట్రాన్స్ఫార్మర్ లను ద్వంసం చేసి కాపర్ కాయిల్స్ దొంగతనం చేసి విక్రయించి డబ్బు పొందే వారని తెలిపారు.కర్రే వినోద్ కుమార్, అంద్రాసి నవీన్, గుంజోల్ల ఈశ్వర్, బాజ హరిప్రసాద్, కర్రే విజయ్ కుమార్, మూల దుర్గాప్రసాద్ రెడ్డి, అబ్దుల్ వసీం హైమద్ అలియాస్ తిల్లి బాబా అనే వ్యక్తులు ఆర్మూరు కు చెందిన వారు ముఠాగా ఏర్పడ్డారు. వీరిపై గతం లో పలు స్టేషన్లలో ఇది వరకే కేసులున్నాయని తెలిపారు.ఈ కేసు చేదించుటలో ముఖ్య పాత్ర పోషించిన సిబ్బందిని అభినందించారు.

# బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటే

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వం కాలేశ్వరం ప్రాజెక్టు పై తీర్మానం చేసి సిబిఐ విచారణకు పంపిన అంశంపై విచారణ జరిపించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. బంజారాల శీత్ల పండుగ సందర్భంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడి తండాలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పై బిజెపి నాయకులు చేస్తున్నారని అన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ కొరకు తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే ఇప్పటివరకు విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.కాళేశ్వరంపై సీబీఐ విచారణ కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తేనే బీజేపీ బీఆర్ఎస్ ఒకటి కాదని భావిస్తామని లేదంటే రెండు పార్టీలు ఒకటేనని ప్రజలకు వివరిస్తామని మంత్రి తెలిపారు.



## ప్రధాని మోడీకి అరుదైన గౌరవం

భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా దేశం తమ అత్యున్నత పౌర పురస్కారమైన ’బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా’అవార్డును ప్రధాని మోదీకి ప్రకటించింది. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఇండోనేసియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com